www.udyamakeratam.com
PRGI No. : TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 95 | 20-9-2026 | ఆదివారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |




# 51 వేల మందికి కేంద్ర కొలువులు

20వ రోజ్‌గార్ మేళాలో నియామక పత్రాలు

45 ప్రాంతాల్లో ఏకకాలంలో కార్యక్రమం

2047 వికసిత భారత్‌లో యువతదే కీలక పాత్ర

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్

వెయ్యి ఐటీఐల ఆధునీకరణకు రూ.60 వేల కోట్లు

ఇప్పటివరకు 12.75 లక్షల మందికి నియామక పత్రాలు

4



## వీళ్లకు స్టూడెంట్స్ వద్దు..
# అంధభక్తులే కావాలి

ప్రశ్నించే విద్యార్థులంటే వ్యవస్థకు భయం

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు

సమస్యలను రాహుల్ ముందుంచిన విద్యార్థులు

హక్కుల కోసం నిలబడాలని పిలుపు

4



# 440 ఎకరాల లెక్కేంటి?

## 9 జిల్లాలు.. 24 మండలాలు.. 31 గ్రామాల్లో భూములు: సీఎం

- కేసీఆర్ దంపతుల పేరిట 67 ఎకరాలకుపైగా ఉన్నట్లు వెల్లడి
- కేటీఆర్ కుటుంబం పేరిట 123 ఎకరాలున్నట్లు ప్రకటన
- సీలింగ్ చట్టం వర్తింపుపై రేవంత్ ప్రశ్నలు
- ఎర్రవల్లి భూములపై క్షేత్రస్థాయి సర్వే ప్రారంభం

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (ఉద్యమ కెరటం):** కేసీఆర్ కుటుంబ సభ్యులు, బంధువులకు రాష్ట్రంలోని 9 జిల్లాలు, 24 మండలాలు, 31 గ్రామాల్లో కలిపి సుమారు 440 ఎకరాల భూములు ఉన్నాయంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో వెల్లడించిన వివరాలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త వివాదానికి తెరతీశాయి. సెప్టెంబర్ 16న 22ఏ భూములపై జరిగిన చర్చలో సీఎం ఈ లెక్కలను సభ ముందుంచారు. అయితే ఇవి సీఎం చేసిన ఆరోపణలు, ఆయన ప్రస్తావించిన ప్రభుత్వ రికార్డుల ఆధారంగా వెల్లడించిన వివరాలు మాత్రమే. భూముల యాజమాన్యం లేదా చట్టవిరుద్ధతపై తుది నిర్ధారణ జరగలేదు.

వివరాలు 2లో..

- తొలివిడత ఎర్రవల్లి భూముల సర్వే..
- 21న ఆధారాలతో హాజరుకావాలని ఆదేశం
- సర్వే నంబర్ 325పై సమగ్ర పరిశీలన

02



# 50 మంది రైతులకు నోటీసులు

## ఇక ప్రజాక్షేత్రంలోనే
# అసలు పరీక్ష!

దానం అనర్హతతో ఖైరతాబాద్ రాజకీయం హాట్

హైకోర్టు తీర్పుతో బీఆర్ఎస్‌కు న్యాయపరమైన ఊరట

ఉప ఎన్నికపై మూడు ప్రధాన పార్టీల కసరత్తు

సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్

న్యాయ పరిణామాలతోనే ఉప ఎన్నికపై స్పష్టత

2




## సుప్రీంకోర్టును ఆశ్రయించిన
# దానం నాగేందర్

- హైకోర్టు అనర్హత తీర్పుపై అప్పీల్
- ఉత్తర్వుల అమలుపై స్టే కోరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే
- పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో అనర్హత వేటు
- ఖైరతాబాద్ స్థానాన్ని ఖాళీగా ప్రకటించిన హైకోర్టు
- తీర్పుతో ఉప ఎన్నికకు తెరలేచిన పరిస్థితి

2





# ఏపీకి నీళ్లు

## పాలమూరు రైతులకు కన్నీళ్లు

ఎల్‌నినో పేరుతో నీటి తరలింపు

ఆరుగంటలు మాత్రమే విద్యుత్ సరఫరా

బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం

.. వివరాలు 3లో



## దానం అనర్హత తీర్పు
# రాజ్యాంగ విజయం

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల బండారం బట్టబయలు

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

.. వివరాలు 3లో



## సృష్టి ఉన్నంతవరకూ
# ధర్మం ఉంటుంది

సమస్త సంతోషానికీ ధర్మమే మూలం

మోహన్ భాగవత్

.. వివరాలు 4లో



## వికసిత్ భారత్ సాధనలో
# కీలక పాత్ర

దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటా 10 శాతానికి పెంచే దిశగా ప్రణాళిక : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

3

## భాగ్యనగరాన్ని ముంచెత్తిన
# కుండపోత

- అల్పపీడన ప్రభావంతో సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం
- వినాయక మండపాల్లోకి చేరిన నీరు

3





# పాలమాకుల వద్ద ఘోరం

ఒకే కుటుంబంలో నలుగురు మృతి

అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టిన ఇన్నోవా

2

## 22ఏ సమస్యలకు
# త్వరలో ముగింపు

12 అంశాలలో ఇప్పటికే రెండింటికి జీవో జారీ

మరికొన్ని అంశాలపై తీపి కబురు

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

3



ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
ఆదివారం 20 సెప్టెంబర్ 2026



# భాగ్యనగరాన్ని ముంచెత్తిన కుండపోత

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (ఉద్యమ కెరటం):** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో హైదరాబాద్‌లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణం మారిపోయి బలమైన ఈదురుగాలులతో కుండపోత మొదలైంది. కొద్దిసేపటికే వర్షం తీవ్రత పెరగడంతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. బంగాళాఖాతంలో చోటుచేసుకున్న వాతావరణ మార్పుల ప్రభావంతోనే వర్షాలు కురుస్తున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. భారీ వర్షానికి ఐటీ కారిడార్‌తో పాటు పలు నివాస, వ్యాపార ప్రాంతాల్లో రహదారులు నీటితో నిండిపోయాయి. బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్, మెహిదీపట్నం, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, మాదాపూర్, బాలానగర్, మియాపూర్ ప్రాంతాల్లో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉప్పల్, లక్డీకాపూల్, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, ఎల్‌బీనగర్, హయత్‌నగర్ ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురిసింది. గణేష్ నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన పలు మండపాల్లోకి వర్షపు నీరు చేరడంతో నిర్వాహకులు, భక్తులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలోనే భారీ వర్షం కురవడంతో ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ స్తంభించింది. రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షం నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు సూచించారు. విద్యుత్ తీగలు, స్తంభాల సమీపంలో అప్రమత్తంగా ఉండాలని, వాహనదారులు, బాటసారులు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు, మున్సిపల్ అధికారులు హెచ్చరించారు.

# పాలమాకుల వద్ద ఘోరం

**ఒకే కుటుంబంలో నలుగురు మృతి**

**అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టిన ఇన్నోవా**



**శంషాబాద్, సెప్టెంబర్ 19 (ఉద్యమ కెరటం):** హైదరాబాద్ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శంషాబాద్ సమీపంలోని పాలమాకుల వద్ద వేగంగా వెళ్తున్న ఇన్నోవా కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టి బోల్తాపడింది. ఈ దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందగా, కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. మృతులను వ్యాపారవేత్త కేతావత్ లింబ్య (54), కేతావత్ జమున (45), కత్రావత్ మాన్సింగ్ (48), కేతావత్ వాగ్రం (45)గా గుర్తించారు. వీరంతా మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం మెట్టుగడ్డతండాకు చెందినవారు. స్వగ్రామం నుంచి హైదరాబాద్ వైపు వస్తుండగా పాలమాకుల వద్ద ప్రమాదం జరిగింది. ప్రమాద తీవ్రతకు ఇన్నోవా కారు బోల్తాపడడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రాణాలు కోల్పోయారు. డ్రైవర్ అశోక్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన అశోక్‌ను చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రమాదానికి కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# మరిన్ని ఆకర్షణీయమైన రంగుల్లో యూనిఫాం

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష**



**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలోని విద్యార్థులకు అందించే యూనిఫాంలు మరిన్ని ఆకర్షణీయమైన రంగుల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని, డిజైన్లలో వైవిధ్యానికి ప్రయత్నించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన విద్యార్థులకు అందిస్తున్న యూనిఫాంలు, ఇతర విద్యా సామగ్రి పంపిణీ ప్రక్రియపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు ఇప్పటికే మొదటి జత యూనిఫాం పంపిణీ పూర్తయిందని, ఈ నెలాఖరులోగా రెండో జతను కూడా అందజేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో విద్యార్థులకు ఇప్పటికే రెండు జతల యూనిఫాంలు పంపిణీ చేసినట్లు తెలిపారు. నోటు పుస్తకాలతో పాటు వసతి గృహాలు, రెసిడెన్షియల్స్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులందరికీ ప్లేట్లు, గ్లాసులు, కార్పెట్లు, బెడ్‌షీట్లు, టవళ్ల పంపిణీ పూర్తయినట్లు స్పష్టం చేశారు. ఈ ఏడాది అందించిన యూనిఫాం, ఇతర సామగ్రి నాణ్యత పట్ల తల్లిదండ్రుల నుంచి పూర్తి సంతృప్తి వ్యక్తమైందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వచ్చే విద్యాసంవత్సరం పాఠశాలలు ప్రారంభమయ్యే మొదటి రోజే విద్యార్థులందరికీ యూనిఫాంలు, ఇతర సామగ్రి అందేలా ఇప్పటి నుంచే పక్కా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం ఉన్నదానికంటే అదనంగా 10 శాతం పెరిగే అవకాశం ఉందని, ఆ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

# 440 ఎకరాల లెక్కేంటి?

మొదటి పేజీ తరువాయి

రేవంత్ సభలో వెల్లడించిన లెక్కల ప్రకారం కేసీఆర్, ఆయన భార్య శోభ పేరిట సుమారు 67 ఎకరాలు, కేటీఆర్ కుటుంబ సభ్యుల పేరిట 123 ఎకరాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో కేటీఆర్ పేరిట 49.5 ఎకరాలు, శైలిమ పేరిట 17.5 ఎకరాలు, అలేఖ్య పేరిట 9.38 ఎకరాలు, హిమాన్షు పేరిట 46.3 ఎకరాలు ఉన్నట్లు సీఎం వివరించారు. అలాగే హరీశ్‌రావు కుటుంబానికి సుమారు 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాలు, జోగినపల్లి సంతోష్‌కుమార్ కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్‌రావుకు 52 ఎకరాలు, కొండల్‌రావుకు 48 ఎకరాలు ఉన్నట్లు రేవంత్ పేర్కొన్నారు. మొత్తంగా కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట 439 ఎకరాలకు పైగా ఉన్నాయన్నది సీఎం వాదన. కేసీఆర్ 2004 ఎన్నికల అఫిడవిట్‌లో వ్యవసాయ భూములు లేవని పేర్కొన్నారని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తావించారు. ఇప్పుడు కుటుంబానికి వందల ఎకరాలు ఎలా వచ్చాయో వివరించాలని ఆయన ప్రశ్నించారు. అయితే భూములు కలిగి ఉండటమే చట్టవిరుద్ధతకు నిదర్శనం కాదు. అవి ఎప్పుడు, ఎవరి నుంచి కొనుగోలు చేశారు? ఆయా భూముల వర్గీకరణ ఏమిటి? కుటుంబ సభ్యులకు ఎలా బదలాయించబడ్డాయి? వ్యవసాయ భూ సీలింగ్ నిబంధనలు ఎలా వర్తిస్తాయి? వంటి అంశాలు సంబంధిత రికార్డులు, చట్టపరమైన పరిశీలనలో తేలాల్సి ఉంటుంది. 440 ఎకరాల కుటుంబ భూముల లెక్కకు వేరుగా ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ పరిసర భూములపై మరో వివాదం కొనసాగుతోంది. ఫాంహౌస్ పరిధిలో సుమారు 700 ఎకరాలు ఉన్నాయని, అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి కూడా ఉందని రేవంత్ అసెంబ్లీలో ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో రెవెన్యూ, సర్వే అధికారులు ఎర్రవల్లి పరిసరాల్లో క్షేత్రస్థాయి సర్వేను ఇప్పటికే ప్రారంభించారు. సర్వే నంబర్లు, ప్రభుత్వ భూమి విస్తీర్ణం, పాత రికార్డులు, గతంలో భూములు ఎవరి పేరిట ఉన్నాయనే వివరాలను పరిశీలిస్తున్నారు. మరోవైపు సీఎం ఆరోపణలను బీఆర్ఎస్ నేత కేటీఆర్ సవాల్ చేశారు. ప్రభుత్వమే ఏర్పాటు చేసే ప్రత్యేక దర్యాప్తు బృందం కాకుండా హైకోర్టు లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో తమ కుటుంబంతోపాటు రేవంత్ రెడ్డి కుటుంబ ఆస్తులపైనా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అక్రమాలు నిరూపితమైతే చట్టపరమైన పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధమని పేర్కొన్నారు. దీంతో '440 ఎకరాలు' ఇప్పుడు రాజకీయ ఆరోపణను దాటి రికార్డుల పరిశీలన అంశంగా మారింది. భూములు ఎవరి పేరిట ఉ



న్నాయి? ఎలా సమకూరాయి? సీలింగ్ నిబంధనలు వర్తిస్తాయా? ఎర్రవల్లిలో ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగిందా? అనే ప్రశ్నలకు ప్రస్తుతం జరుగుతున్న అధికారిక విచారణ, సర్వే నివేదికలే స్పష్టత ఇవ్వనున్నాయి.

# 50 మంది రైతులకు నోటీసులు

**తొలివిడత ఎర్రవల్లి భూముల సర్వే..**

**21న ఆధారాలతో హాజరుకావాలని ఆదేశం**

**సర్వే నంబర్ 325పై సమగ్ర పరిశీలన**

**మూడో రోజూ కొనసాగిన క్షేత్రస్థాయి సర్వే**

**పాత రికార్డులు.. హద్దులపై అధికారుల ఆరా**

**మర్కుక్, సెప్టెంబర్ 19 (ఉద్యమ కెరటం):** మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలోని ఎర్రవల్లి భూములపై రెవెన్యూ శాఖ చేపట్టిన సర్వే మరింత ముమ్మరమైంది. మర్కుక్ మండలం ఎర్రవల్లి సర్వే నంబర్ 325లోని భూములకు సంబంధించి తొలివిడతగా 50 మంది రైతులకు తహసీల్దార్ కార్యాలయం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 21న భూములకు సంబంధించిన ఆధారాలతో హాజరై తమ హద్దులను సర్వే అధికారులకు చూపించాలని సూచించినట్లు సమాచారం. మొత్తం 215 మంది రైతులకు దశలవారీగా నోటీసులు ఇచ్చే ప్రక్రియ చేపట్టినట్లు మరో వార్తా నివేదిక పేర్కొంది. సర్వే నంబర్ 325లో సుమారు 388 ఎకరాల భూముల హద్దులు, రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నారు. జిల్లా సర్వే, భూ రికార్డుల అధికారి ప్రొసీడింగ్స్ ఆధారంగా సర్వే, సరిహద్దుల చట్టం-1923 ప్రకారం సమగ్ర సర్వే చేపడుతున్నట్లు నోటీసుల్లో పేర్కొన్నారు. పట్టాదారులు, అనుభవదారులు తమ వద్ద ఉన్న పహాణీలు, ఇతర భూ రికార్డులతో హాజరై హద్దులను తెలియజేయాలని అధికారులు కోరారు. గురువారం ప్రారంభమైన సర్వే శనివారం మూడో రోజూ కొనసాగింది. ఎర్రవల్లి, శివారు వెంకటాపూర్, వరదరాజ్‌పూర్ పరిధుల్లో సర్వే నంబర్ 325 హద్దులను అధికారులు పరిశీలిస్తున్నారు. డిజిటల్ సర్వే పద్ధతులతో



భూముల సరిహద్దులను గుర్తించడంతోపాటు పాత రెవెన్యూ రికార్డులను ప్రస్తుత వివరాలతో సరిపోల్చే ప్రక్రియ కొనసాగుతోంది. ఇదే సమయంలో సర్వే నంబర్ 325లోని సుమారు 180 ఎకరాలు తమ గ్రామ పరిధిలోకే వస్తాయని శివారు వెంకటాపూర్ గ్రామస్థులు వాదిస్తున్నారు. పాత ఖాస్రా, సేత్వార్ రికార్డుల ఆధారంగానే హద్దులు నిర్ధారించాలని వారు కోరుతున్నారు. మరోవైపు కొందరు రైతులు తాము దశాబ్దాలుగా ఈ భూములను సాగు చేస్తున్నామని చెబుతున్నారు. సర్వే నంబర్ 325లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందా లేదా తేల్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఆదేశించిన నేపథ్యంలో ఈ సర్వే ప్రారంభమైంది. అయితే భూమి ఆక్రమణ జరిగిందనేది ప్రస్తుతం ప్రభుత్వ పక్షం చేసిన ఆరోపణ మాత్రమే. అధికారులు కూడా సర్వే ద్వారా ప్రభుత్వ, అసైన్డ్, పట్టా భూముల హద్దులు, యాజమాన్య వివరాలను నిర్ధారించే ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు చెబుతున్నారు. రైతుల వద్దనున్న ఆధారాలు, పాత రెవెన్యూ రికార్డులు, క్షేత్రస్థాయి కొలతలను సరిపోల్చిన తర్వాతే సర్వే నంబర్ 325లోని భూముల వాస్తవ స్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ఇక ప్రజాక్షేత్రంలోనే అసలు పరీక్ష!

**దానం అనర్హతతో ఖైరతాబాద్ రాజకీయం హాట్**

**హైకోర్టు తీర్పుతో బీఆర్ఎస్‌కు న్యాయపరమైన ఊరట**

**ఉప ఎన్నికపై మూడు ప్రధాన పార్టీల కసరత్తు**

**సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్**

**న్యాయ పరిణామాలతోనే ఉప ఎన్నికపై స్పష్టత**

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (ఉద్యమ కెరటం):** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను తెలంగాణ హైకోర్టు అనర్హుడిగా ప్రకటించడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరతీసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన దానం.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన నేపథ్యంలో ఆయనపై దాఖలైన అనర్హత పిటిషన్లపై హైకోర్టు ఈ తీర్పు వెలువరించింది. ఏప్రిల్ 23, 2024 నుంచి ఆయన అనర్హుడని పేర్కొంటూ ఖైరతాబాద్ స్థానాన్ని ఖాళీగా ప్రకటించింది. ఈ తీర్పుతో బీఆర్ఎస్ న్యాయపోరాటానికి అనుకూల ఫలితం లభించినప్పటికీ,




రాజకీయంగా తదుపరి దశ ఖైరతాబాద్‌లోనే ఉండనుంది. అయితే ఉప ఎన్నిక వెంటనే జరుగుతుందని తేల్చిచెప్పలేని తాజా పరిణామం చోటుచేసుకుంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో అత్యున్నత న్యాయస్థానంలో జరిగే తదుపరి పరిణామాలు కీలకం కానున్నాయి. హైకోర్టు తీర్పు వెలువడిన వెంటనే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల్లో ఖైరతాబాద్‌పై రాజకీయ చర్చ మొదలైంది. బీఆర్ఎస్‌లో అభ్యర్థిత్వానికి పలువురి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు వార్తలు వస్తుండగా, కాంగ్రెస్‌లో దానం నాగేందర్‌తోపాటు ఇతర ఆశావహుల పేర్లపైనా చర్చ జరుగుతోంది. బీజేపీ కూడా తన వ్యూహంపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్‌కు ఈ పరిణామం రాజకీయంగా కీలకంగా మారింది. హైకోర్టు తీర్పును ఫిరాయింపులపై తమ పోరాటానికి విజయంగా ఆ పార్టీ నేతలు అభివర్ణిస్తున్నారు. ఒకవేళ ఉప ఎన్నిక జరిగితే ప్రజల మద్దతును కూడగట్టేందుకు ఆ తీర్పును ప్రధాన రాజకీయ అంశంగా ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంది. మరోవైపు కాంగ్రెస్, బీజేపీ కూడా తమ తమ రాజకీయ వాదనలతో బరిలోకి దిగనున్నాయి. బీఆర్ఎస్ నేతలు మాత్రం ఖైరతాబాద్‌లో తమ పార్టీ విజయం సాధిస్తుందనే ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

## ఫలితమే రాజకీయ సందేశం

ఉప ఎన్నిక జరిగితే దాని ఫలితం మూడు పార్టీలకూ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకోనుంది. అయితే ఏ పార్టీ గెలుస్తుందో, ఓటమి వల్ల ఏ పార్టీ కేడర్‌పై ఎంత ప్రభావం పడుతుందో ఇప్పుడే నిర్ధారించడం సాధ్యం కాదు. అభ్యర్థుల ఎంపిక, ప్రచార అంశాలు, స్థానిక సమస్యలు, అప్పటి రాజకీయ పరిస్థితులు, ఓటర్ల నిర్ణయం ఫలితాన్ని నిర్దేశిస్తాయి. 2023లో ఖైరతాబాద్ ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థిగా దానం నాగేందర్‌ను ఎన్నుకున్నారు. ఆ తర్వాత చోటుచేసుకున్న పార్టీ మార్పు వివాదం ఇప్పుడు న్యాయస్థానం వరకు వెళ్లింది. హైకోర్టు తీర్పుతో ఒక దశ ముగిసినా.. దానం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో న్యాయపోరాటం ఇంకా కొనసాగుతోంది. అక్కడి తీర్పు తర్వాత ఉప ఎన్నికకు మార్గం సుగమమైతే మాత్రం ఖైరతాబాద్‌లో అసలు రాజకీయ పరీక్ష ప్రజాక్షేత్రంలోనే జరగనుంది.

# సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్

**హైకోర్టు అనర్హత తీర్పుపై అప్పీల్**

**ఉత్తర్వుల అమలుపై స్టే కోరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే**

**పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో అనర్హత వేటు**

**ఖైరతాబాద్ స్థానాన్ని ఖాళీగా ప్రకటించిన హైకోర్టు**

**తీర్పుతో ఉప ఎన్నికకు తెరలేచిన పరిస్థితి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (ఉద్యమ కెరటం):** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. పార్టీ ఫిరాయింపుల కేసులో తనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆయన అత్యున్నత న్యాయస్థానంలో అప్పీల్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు ఉత్తర్వుల అమలుపై తక్షణమే స్టే విధించాలని కోరారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి గెలుపొందారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో ఆయనపై పార్టీ ఫిరాయింపుల చట్టం కింద అనర్హత వేటు వేయాలని ప్రత్యర్థి పార్టీల నేతలు పిటిషన్లు దాఖలు చేశారు.

## సెప్టెంబర్ 18న తీర్పు

ఈ పిటిషన్లపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 18న తీర్పు వెలువరించింది. 2024 ఏప్రిల్ 23 నుంచి అమల్లోకి వచ్చేలా దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానాన్ని ఖాళీగా ప్రకటించింది.

## ఇప్పుడు సుప్రీంకోర్టులో న్యాయపోరాటం

హైకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ స్థానం ఖాళీ కావడంతో ఉప ఎన్నికకు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తీర్పును రద్దు చేయడంతో పాటు దాని అమలుపై స్టే ఇవ్వాలని



కోరారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ అనంతరం వెలువరించే ఆదేశాలపై ఖైరతాబాద్ తదుపరి రాజకీయ పరిణామాలు ఆధారపడి ఉన్నాయి.

# వికసిత్ భారత్ సాధనలో కీలక పాత్ర

- దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటా 10 శాతానికి పెంచే దిశగా ప్రణాళిక
- ప్రైవేట్, సంస్థాగత పెట్టుబడుల సమీకరణ వైపు అడుగులు
- క్యూర్, ప్యూర్, రేర్ విధానంతో సమతుల్య అభివృద్ధి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబర్ 19 (ఉద్యమ కెరటం):** వికసిత్ భారత్–2047 లక్ష్య సాధనలో తెలంగాణ రాష్ట్రం అత్యంత కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో శనివారం ఢిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ దిశగా భారతదేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ' సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ కూడా పాల్గొన్నారు. కేంద్రం, రాష్ట్రాలు విడివిడిగా కాకుండా సహకార సమాఖ్య స్ఫూర్తితో పనిచేసినప్పుడే కనీవినీ ఎరుగని వికాసం సాధ్యమవుతుందని, తెలంగాణ కేవలం నిధులు అడగడానికే కాకుండా పక్కా ఆర్థిక విధానంతో ఈ చర్చల్లో భాగస్వామ్యమైందని ఆయన స్పష్టం చేశారు.

### 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా పయనం

రాష్ట్ర ఆర్థిక పునాదులు అత్యంత బలంగా ఉన్నాయని భట్టి విక్రమార్క వెల్లడించారు. 2025–26లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని, ప్రస్తుత ధరల ప్రకారం 10.7 శాతం వృద్ధి నమోదైనట్లు పేర్కొన్నారు. స్థిర ధరల ప్రకారం వాస్తవ జీఎస్‌డీపీ వృద్ధి 8.5 శాతంగా అంచనా వేస్తున్నామని, రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కి చేరి జాతీయ సగటు (రూ.2,19,575) కంటే రెండింతలు ఎక్కువగా ఉందన్నారు. ఇదే వేగంతో ముందడుగు వేస్తే 2047 నాటికి తెలంగాణ 1.21 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని, అయితే అంతకంటే పెద్దదైన 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని నిర్దేశించుకుని దేశ శ్రేయస్సుకు భాగస్వామ్యం అందిస్తామని చెప్పారు.

### ప్రైవేట్ పెట్టుబడులు ఉ క్యూర్, ప్యూర్, రేర్ మోడల్

మౌలిక వసతుల కల్పనలో కేవలం ప్రభుత్వ రుణాలపై ఆధారపడకుండా ప్రైవేట్ పెట్టుబడులు, సావరిన్ ఫండ్స్, పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యాలు (పీపీపీ), గ్రీన్ బాండ్ల ద్వారా నిధులు సమకూర్చే నమూనాను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. అలాగే, అభివృద్ధి హైదరాబాద్ నగరానికే పరిమితం కాకుండా క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ – ఐటీ, ఏఐ, లైఫ్ సైన్సెస్), ప్యూర్ (పెరి అర్బన్ రీజియన్ – తయారీ, పారిశ్రామిక రంగాలు), రేర్ (రూరల్ అగ్రికల్చరల్ ఎకానమీ – ఫుడ్ ప్రాసెసింగ్, డిజిటల్ అగ్రి) అనే మూడు వికేంద్రీకృత మండలాలను రూపొందించినట్లు వివరించారు.

### భారత్ ఫ్యూచర్ సిటీ - స్కిల్ యూనివర్సిటీ

సుమారు 30 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో దేశంలోనే తొలి నెట్–జీరో, ఏఐ ఆధారిత గ్రీన్ మెగాసిటీగా 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని అభివృద్ధి చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రస్తావించారు. రీజినల్ రింగ్ రోడ్డు ద్వారా ఈ ప్రాంతాలను అనుసంధానిస్తామన్నారు. సాంకేతిక శిక్షణ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యంతో 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేసినట్లు, మానవ వనరుల వికాసంతో ప్రతి ఒక్కరినీ అభివృద్ధిలో భాగస్వాములను చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.

# ఏపీకి నీళ్లు.. పాలమూరు రైతులకు కన్నీళ్లు

- ఎల్ నినో పేరుతో నీటి తరలింపు
- ఆరుగంటలు మాత్రమే విద్యుత్ సరఫరా
- లోవోల్టేజీ కారణంగా కాలిపోతున్న మోటార్లు
- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ఎందుకు చర్యలు తీసుకోరు?
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం



**వనపర్తి, సెప్టెంబర్ 19 (ఉద్యమ కెరటం) :** ఏపీకి వంద టీఎంసీల నీళ్లు.. పాలమూరు రైతులకు కన్నీళ్లేనా ప్రకృతి అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ పాలమూరు రైతులకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఎల్నినో పేరుతో ఆంధ్రప్రదేశ్‌కు సాగునీటిని తరలిస్తున్నారని విమర్శించారు. ఏపీకి నీళ్లు వెళ్తున్నప్పుడు తెలంగాణకు ఎందుకు నీరు అందడం లేదని ప్రశ్నించారు.కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందడంతో శనివారం కేటీఆర్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పెబ్బేరు మండలంలోని గుమ్మడం, చెలిమిల విద్యుత్ సబ్‌స్టేషన్లను సందర్శించి లాగ్ రిజిస్టర్లను పరిశీలించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా పరిస్థితులను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెబ్బేరు మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ వ్యవసాయానికి ఆరు గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారని కేటీఆర్ తెలిపారు. లోఓల్టేజీ, తరచూ విద్యుత్ కోతల కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి సుమారు ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని పేర్కొన్నారు. వరదల సమయంలో నీటిని మళ్లించి చెక్‌డ్యామ్‌లు, చెరువులను నింపినట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 7 వేల మెగావాట్లుగా ఉన్న విద్యుత్ స్థాపిత సామర్థ్యాన్ని 24 వేల మెగావాట్లకు పెంచామని కేటీఆర్ పేర్కొన్నారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండ మార్గాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు నీరు తరలిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. జూరాలకు ఎగువ నుంచి నీటి ప్రవాహం లేదని అధికారులు చెబుతున్నారని, దీంతో కాలువలకు నీటి విడుదల నిలిచిపోయిందని తెలిపారు. అయితే మరోవైపు ఏపీకి నీరు వెళ్తుంటే తెలంగాణకు ఎందుకు నీరు అందడం లేదని ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పంపులను తరచూ ఆన్, ఆఫ్ చేయడం వల్ల రైతులకు ప్రయోజనం ఉండదని, పంపులను ప్రారంభించిన తర్వాత నిరంతరాయంగా నడపాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం, జిల్లాలోనే రైతులు సాగునీరు, విద్యుత్ కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగడం లేదని కేటీఆర్ ఆరోపించారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు తమ ప్రాజెక్టుల విషయంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఆలమట్టి ఎత్తు పెంపు అంశంపై కర్ణాటక ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, దీనివల్ల భవిష్యత్‌లో పాలమూరుకు నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో పాలమూరు ప్రాంతానికి రావాల్సిన వాటా దక్కే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి ప్రజాతీర్పు కోరాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న అధికార పక్షం వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జీవన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్‌గౌడ్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భాగ్యనగరాన్ని ముంచెత్తిన కుండపోత

- అల్పపీడన ప్రభావంతో సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం
- ఈదురుగాలులతో పలు ప్రాంతాల్లో జలమయం
- ఐటీ కారిడార్ సహా ప్రధాన రహదారులపై భారీగా నీరు
- వినాయక మండపాల్లోకి చేరిన వర్షపు నీరు
- సాయంత్రం వేళ స్తంభించిన ట్రాఫిక్
- విద్యుత్ తీగలు, స్తంభాల వద్ద అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (ఉద్యమ కెరటం):** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో హైదరాబాద్‌లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణం మారిపోయి బలమైన ఈదురుగాలులతో కుండపోత మొదలైంది. కొద్దిసేపటికే వర్షం తీవ్రత పెరగడంతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. బంగాళాఖాతంలో చోటుచేసుకున్న వాతావరణ మార్పుల ప్రభావంతోనే వర్షాలు కురుస్తున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. భారీ వర్షానికి ఐటీ కారిడార్‌తో పాటు పలు నివాస, వ్యాపార ప్రాంతాల్లో రహదారులు నీటితో నిండిపోయాయి. బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్, మెహిదీపట్నం, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, మాదాపూర్, బాలానగర్, మియాపూర్ ప్రాంతాల్లో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉప్పల్, లక్డీకాపూల్, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, ఎల్‌బీనగర్, హయత్‌నగర్ ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురిసింది. గణేష్ నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన పలు మండపాల్లోకి వర్షపు నీరు చేరడంతో నిర్వాహకులు, భక్తులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలోనే భారీ వర్షం కురవడంతో ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ స్తంభించింది. రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షం నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు. విద్యుత్ తీగలు, స్తంభాల సమీపంలో అప్రమత్తంగా ఉండాలని, వాహనదారులు, బాటసారులు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు, మున్సిపల్ అధికారులు హెచ్చరించారు.



# 22ఏ సమస్యలకు త్వరలో ముగింపు

### 12 అంశాలలో ఇప్పటికే రెండింటికి జీవో జారీ

### మరికొన్ని అంశాలపై తీపి కబురు

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని, శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనకు అనుగుణంగా ప్రజలకు త్వరలోనే మరిన్ని తీపి కబుర్లు అందుతాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ప్రభుత్వం ప్రాధాన్యతగా గుర్తించిన 12 అంశాలలో ఇప్పటికే రెండింటికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని 44 కాలనీల్లో ఇళ్ల క్రమబద్ధీకరణకు సంబంధించి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్ మరియు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఏ పార్టీ ప్రాతినిధ్యం వహిస్తున్నా భేషజాలకు పోకుండా ఎల్.బి.నగర్ పరిధిలోని 44 కాలనీల భూ సమస్యలపై కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిషేధిత జాబితా (22–ఎ) లో ఉన్న ఈ భూముల సమస్యను నెల రోజుల్లోగా పరిష్కరించి ఇళ్లను రెగ్యులరైజ్ చేస్తామని, ఎవరి ఇళ్లనూ కూల్చబోమని హామీ ఇచ్చారు. జీవో 118 ద్వారా మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని మరికొంతమంది బాధితులకు కూడా త్వరలోనే ఉపశమనం కలిగిస్తామని, రిజిస్ట్రేషన్ సమస్యలు ఉన్న వారికి, దరఖాస్తు చేసుకోని వారికి మరొక అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు.

### సింగరేణి కార్మికుల నిరీక్షణకు ముగింపు

సింగరేణి బొగ్గు బెల్ట్ పరిధిలోని కార్మిక కుటుంబాలు దశాబ్దాలుగా నివసిస్తున్న ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తీసుకొచ్చిన జీవో 76ను ప్రామాణికంగా తీసుకుని సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తున్నామన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, పెద్దపల్లి, ఆదిలాబాద్ సహా 8 జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను హైకోర్టు ఆదేశాలకు లోబడి 45 రోజుల్లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దీనికోసం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో సింగరేణి, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

# దానం అనర్హత తీర్పు రాజ్యాంగ విజయం

### కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల బండారం బట్టబయలు

### కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (ఉద్యమ కెరటం):** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై హైకోర్టు ఇచ్చిన అనర్హత వేటు తీర్పు చారిత్రాత్మకమైనదని, ఇది రాజ్యాంగ విజయమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అభివర్ణించారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ అవసరాల కోసం పార్లమెంట్ ఆమోదించిన చట్టాలను ధిక్కరించే అలవాటును కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఇప్పటికైనా మానుకోవాలని హితవు పలికారు. దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపు వ్యవహారంలో న్యాయస్థానం ఇచ్చిన తీర్పును తెలంగాణ ప్రజలందరూ హర్షిస్తున్నారని పేర్కొన్నారు. అధికార దుర్వినియోగంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి నుంచి నిన్నటి కేసీఆర్ పాలన వరకు చట్టాలను విస్మరించి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారని కిషన్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డితో రాజీనామా చేయించకుండానే మంత్రి పదవి ఇచ్చారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని దుయ్యబట్టారు. దానం నాగేందర్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన నాటి నుంచే ఆయన శాసనసభ్యత్వం రద్దవుతుందని హైకోర్టు స్పష్టం చేయడాన్ని స్వాగతిస్తూ, ఇది ప్రజాస్వామ్యానికి లభించిన ఊరటగా అభివర్ణించారు. 'సంవిధాన్ బచావో' నినాదం పచ్చి బూటకం ఢిల్లీలో రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకుని 'సంవిధాన్ బచావో' అని ప్రచారం చేసే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీరు పచ్చి బూటకమని కిషన్ రెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా రికార్డుల్లో ఉన్న నాగేందర్‌కు ఏ ప్రాతిపదికన ఎంపీ టికెట్ ఇచ్చారో రాహుల్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నో పార్టీలను చీల్చిన చరిత్ర కాంగ్రెస్‌దేనని, ఈ రెండు పార్టీల తీరుపై ప్రజలు ఆలోచించాలని పిలుపునిచ్చారు. తెలంగాణను కాంక్రీట్ జంగిల్‌గా మార్చారు గతంలో కేటీఆర్ దుకాణాలు తెరిస్తే, ప్రస్తుతం రేవంత్ రెడ్డి కొత్త దుకాణాలు తెరిచి వసూళ్లకు పాల్పడుతున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. 1,200 మంది అమరుల ప్రాణ త్యాగాలతో తెచ్చుకున్న తెలంగాణలో అప్పులు చేయడం, భూములు అమ్మడం, లిక్కర్ దందా నడపడం పరిపాటిగా మారిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆరోపణలు గుప్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలో ఉండి కూడా బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. భవిష్యత్ తరాల కోసం భూములను కాపాడటంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు విఫలమయ్యాయని, ప్రజల తీర్పును అవహేళన చేసిన నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
ఆదివారం
20 సెప్టెంబర్ 2026



# మహిళను కొట్టి చంపి..

## ఏడుస్తున్న చిన్నారిని మృతదేహంపై ఉంచిన దారుణం

**రాయచూర్ జిల్లాలో సంచలనం సృష్టించిన హత్య ఉదంతం**

**తల్లి మృతదేహాన్ని పట్టుకుని నిస్సహాయంగా ఏడ్చిన ఏడాదిన్నర చిన్నారి**

**ఆరా తీస్తున్న పోలీసులు.. భర్త, ప్రియుడు అదుపులోకి**

**బెంగళూరు, సెప్టెంబర్ 19 (ఉద్యమ కెరటం):** కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలో అత్యంత ఘోరమైన, కలచివేసే ఘటన వెలుగులోకి వచ్చింది. కొందరు దుండగులు ఒక మహిళను దారుణంగా కొట్టి చంపి, ఆమె ఏడుస్తున్న ఏడాదిన్నర కుమార్తెను మృతదేహంపైనే ఉంచి పరారయ్యారు. సింధనూర్ సబ్ డివిజన్‌లోని ఆర్‌హెచ్ క్యాంప్ ప్రాంతానికి చెందిన 25 ఏళ్ల స్నేహపై గ్రామం శివార్లలోని పొలంలో దుండగులు దాడి చేశారు. ఆమె తలపై రాయితో తీవ్రంగా బాది హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పొలాల్లో మహిళ మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు, స్థానికులకు అక్కడ కనిపించిన దృశ్యం తీవ్రంగా చలించిపోయేలా చేసింది. మృతి చెందిన తల్లి స్నేహను గట్టిగా పట్టుకుని, ఆమె ఏడాదిన్నర కుమార్తె నిస్సహాయంగా ఏడుస్తూ కనిపించింది. పోలీసులు చిన్నారిని సురక్షితంగా ఒడిలోకి తీసుకుని, మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్నేహకు నాలుగేళ్ల కిందట అమిత్ అనే వ్యక్తితో వివాహమైంది. అయితే, గత నాలుగు నెలలుగా శుభమ్ అనే వ్యక్తితో ఆమె వివాహేతర సంబంధంలో ఉన్నట్లు తెలిసింది. ఈ కోణంలో విచారణ వేగవంతం చేసిన పోలీసులు, స్నేహ భర్త అమిత్‌తో పాటు ప్రియుడు శుభమ్‌ను కూడా అదుపులోకి తీసుకుని తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. ఈ హత్య వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటి, హత్యకు పాల్పడిన వారు ఎవరు అనే విషయాలను తేల్చేందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు.

# సౌదీకి కొత్త సంకటం!

## హౌతీలతో అమెరికా రహస్య చర్చలు..

**మస్కట్‌లో అమెరికా-హౌతీ ప్రతినిధుల భేటీ**



**రియాద్, సెప్టెంబర్ 19 (ఉద్యమ కెరటం):** యెమెన్‌లో హౌతీల దూకుడు, సౌదీ అరేబియాపై వరుస దాడుల నేపథ్యంలో అమెరికా–హౌతీ ప్రతినిధుల మధ్య ఒమన్ రాజధాని మస్కట్‌లో జరిగిన రహస్య చర్చలు కొత్త చర్చకు తెరతీశాయి. అమెరికా అధికారులు హౌతీ ప్రతినిధులతో గత వారాంతంలో సమావేశమైనట్లు ఐదు వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ వెల్లడించింది. అయితే ఈ చర్చలను అమెరికా విదేశాంగ శాఖ అధికారికంగా ధ్రువీకరించలేదు. హౌతీలు ఇటీవలి దాడుల్లో యెమెన్ ఎర్ర సముద్ర తీరంలో కీలక ప్రాంతాలను స్వాధీనం చేసుకుని, బాబ్ ఎల్--మండెబ్ జలసంధి సమీపంలోని పెరిమ్ దీవిపైనా పట్టు సాధించారు. సౌదీ చమురు రవాణాకు ఈ మార్గం అత్యంత కీలకంగా మారిన సమయంలో హౌతీల పురోగతి రియాద్‌పై ఒత్తిడిని పెంచుతోంది. మస్కట్ చర్చల్లో అమెరికా నౌకలపై దాడులు చేయబోమని, 2025లో వాషింగ్టన్‌తో కుదిరిన కాల్పుల విరమణకు కట్టుబడి ఉంటామని హౌతీ ప్రతినిధులు చెప్పినట్లు రాయిటర్స్ పేర్కొంది. ఒక యెమెన్ వర్గం ప్రకారం.. ఇజ్రాయెల్, ఇతర వాణిజ్య నౌకలపైనా దాడులు చేయకుండా సౌదీ అరేబియాకు చెందిన నౌకలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటామని హౌతీలు తెలిపినట్లు సమాచారం. అయితే దీనిని అమెరికా--హౌతీల మధ్య సౌదీకి వ్యతిరేకంగా కుదిరిన అధికారిక 'ఒప్పందం'గా ప్రకటించే ఆధారాలు ఇప్పటివరకు వెలుగులోకి రాలేదు. హౌతీల తాజా దూకుడు నేపథ్యంలో సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సంప్రదించి సైనిక సహాయం కోరినట్లు రాయిటర్స్ తెలిపింది. అయితే యెమెన్ పోరులో నేరుగా జోక్యం చేసుకునేందుకు వాషింగ్టన్ సుముఖత చూపలేదని ఆ కథనం పేర్కొంది. సౌదీ అరేబియాలోని నగరాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై ఇటీవల దాడులు పెరిగాయి. మక్కా వైపు వస్తున్న హౌతీ డ్రోన్‌ను నగరానికి దక్షిణంగా కూల్చివేసినట్లు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు ప్రకటించాయి. అయితే మక్కా లేదా ఇతర పవిత్ర ప్రదేశాలను తాము లక్ష్యంగా చేసుకోలేదని హౌతీలు ఖండించారు. అందువల్ల మక్కాపై ఉద్దేశపూర్వకంగా దాడికి ప్రయత్నించారనే అంశంపై ఇరుపక్షాల వాదనలు భిన్నంగా ఉన్నాయి. పాకిస్థాన్, టర్కీతో సౌదీకి రక్షణ సహకార ఒప్పందం ఉన్నప్పటికీ యెమెన్ యుద్ధంలో ఆ వ్యవస్థ ఇంకా పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. దేశీయ ఆమోద ప్రక్రియలు, రాజకీయ–వ్యూహాత్మక పరిమితుల కారణంగా ప్రత్యక్ష సైనిక సహకారం కనిపించడం లేదని విశ్లేషణలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాల మధ్య సౌదీపై హౌతీల దాడులు కొనసాగుతుండటం, అమెరికా ప్రత్యక్ష సైనిక జోక్యానికి దూరంగా ఉండటం, మరోవైపు హౌతీలతో వాషింగ్టన్ సంప్రదింపులు జరపడం మధ్యప్రాచ్య సమీకరణాలను మరింత సంక్లిష్టంగా మార్చాయి. అయితే 'అమెరికా సౌదీని మోసం చేసింది', 'హౌతీలతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుంది' అనేవి ప్రస్తుత ఆధారాలతో నిర్ధారిత వాస్తవాలుగా చెప్పలేం; మస్కట్‌లో రహస్య చర్చలు జరిగినట్లు మాత్రమే విశ్వసనీయంగా వెల్లడైంది.

# వాతావరణ సవాళ్లకు భారత్ పరిష్కారాలు

- ఢిల్లీలో అంతర్జాతీయ పర్యావరణ సదస్సు ప్రారంభం
- రెండు రోజుల సదస్సును ప్రారంభించిన ప్రధాని మోదీ
- 17 దేశాల న్యాయమూర్తులు, న్యాయ ప్రతినిధుల భాగస్వామ్యం
- 50 లక్షల ఇళ్లకు సౌర విద్యుత్ వ్యవస్థలు: మోదీ
- అభివృద్ధి చెందుతున్న దేశాలపై నిందలు సరికాదని వ్యాఖ్య



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 (ఉద్యమ కెరటం):** ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న పర్యావరణ, వాతావరణ సవాళ్లకు సమష్టి పరిష్కారాలు కనుగొనాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. జాతీయ హరిత న్యాయస్థానం ఆధ్వర్యంలో ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహిస్తున్న 'ది ఫ్యూచర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ డైనమిక్స్' రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును శనివారం ఆయన ప్రారంభించారు. సెప్టెంబర్ 19, 20 తేదీల్లో జరిగే ఈ సదస్సులో భారత్‌తోపాటు 17 దేశాలకు చెందిన ప్రముఖ న్యాయమూర్తులు, న్యాయ ప్రతినిధులు పాల్గొంటున్నారు. సదస్సు ప్రారంభ కార్యక్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్, జాతీయ హరిత న్యాయస్థానం చైర్‌పర్సన్ జస్టిస్ ప్రకాశ్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ హరిత న్యాయస్థానం మొబైల్ అప్లికేషన్‌ను మోదీ ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణతోపాటు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే దిశగా భారత్ పనిచేస్తోందని మోదీ తెలిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద 50 లక్షలకు పైగా ఇళ్లపై సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గత 12 ఏళ్లలో దేశ సౌర విద్యుత్ సామర్థ్యం సుమారు 2 గిగావాట్ల నుంచి 160 గిగావాట్లకు పైగా పెరిగిందన్నారు. విద్యుత్ వాహనాల వినియోగం కూడా భారీగా పెరిగిందని పేర్కొన్నారు. కర్బన ఉద్గారాల విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలపై అధిక బాధ్యత మోపడం సరికాదని మోదీ వ్యాఖ్యానించారు. భారత్‌తో పోలిస్తే అభివృద్ధి చెందిన దేశాల్లో తలసరి కర్బన ఉద్గారాలు సుమారు ఆరు రెట్లు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. భారత్ తలసరి ఉద్గారాలు ప్రపంచ సగటులో సగానికంటే తక్కువగా ఉన్నాయని వివరించారు. వాతావరణ మార్పులపై పోరులో సమానత్వం, న్యాయం ప్రాతిపదికగా అంతర్జాతీయ సహకారం అవసరమని చెప్పారు. వాతావరణ న్యాయం, జీవవైవిధ్యం, పర్యావరణ చట్టాలు, పునరుత్పాదక ఇంధనం, సుస్థిర నగరాలు, పర్యావరణ పరిపాలన వంటి అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చించనున్నారు. విధానాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణలోని లోపాలను గుర్తించడంతోపాటు వివిధ దేశాల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలు, అనుభవాలను పంచుకోవడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యంగా ఉంది.

# 51 వేల మందికి కేంద్ర కొలువులు

**20వ రోజ్‌గార్ మేళాలో నియామక పత్రాలు**

**45 ప్రాంతాల్లో ఏకకాలంలో కార్యక్రమం**

**2047 వికసిత భారత్‌లో యువతదే కీలక పాత్ర: మోదీ**

**వెయ్యి ఐటీఐల ఆధునీకరణకు రూ.60 వేల కోట్లు**

**ఇప్పటివరకు 12.75 లక్షల మందికి నియామక పత్రాలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 (ఉద్యమ కెరటం):** దేశవ్యాప్తంగా నిర్వహించిన 20వ 'రోజ్‌గార్ మేళా'లో 51 వేల మందికి పైగా యువతకు కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు, సంస్థల్లో నియామక పత్రాలు అందజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమంలో పాల్గొని కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న యువతను ఉద్దేశించి ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే ప్రయాణంలో యువత కీలక పాత్ర పోషించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రభుత్వ సేవలోకి అడుగుపెడుతున్న యువత తీసుకునే ప్రతి నిర్ణయం 'వికసిత భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాలను బలోపేతం చేసేలా ఉండాలని పేర్కొన్నారు. పండుగల వేళ వేలాది కుటుంబాల్లో ఈ నియామకాలు కొత్త ఆనందాన్ని తీసుకొచ్చాయని చెప్పారు. భారత యువత ప్రతిభ, నైపుణ్యాలపై ప్రపంచవ్యాప్తంగా విశ్వాసం పెరుగుతోందని ప్రధాని పేర్కొన్నారు. యువతకు ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. 'పీఎం సేతు' పథకానికి రూ.60 వేల కోట్ల వ్యయం కేటాయించగా, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా వెయ్యి ప్రభుత్వ ఐటీఐలను ఆధునీకరించే కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో 200 హబ్ ఐటీఐలు, 800 స్పోక్ ఐటీఐలు ఉన్నాయి. రైల్వే, హోంశాఖ, రక్షణ, రెవెన్యూ, ఆరోగ్య–కుటుంబ సంక్షేమం, ఆర్థిక సేవలు తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో ఎంపికైన అభ్యర్థులకు తాజా నియామక పత్రాలు అందాయి. 20వ రోజ్‌గార్ మేళాతో కలిపి ఇప్పటివరకు సుమారు 12.75 లక్షల మంది యువతకు కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు, సంస్థల్లో నియామక పత్రాలు అందించినట్లు కేంద్రం వెల్లడించింది. ఉద్యోగాల కోసం ఎదురుచూసే స్థాయి నుంచి ఉద్యోగ అవకాశాలను సృష్టించే స్థాయికి యువత ఎదగాలని మోదీ ఆకాంక్షించారు. ప్రభుత్వ సేవలో చేరిన వారు ప్రజలకు సమర్థంగా, నిజాయతీగా సేవలందిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.



# సృష్టి ఉన్నంతవరకూ ధర్మం ఉంటుంది

**సమస్త సంతోషానికీ ధర్మమే మూలం: మోహన్ భాగవత్**


**యువత ధర్మంపై చర్చించడం సంతోషకరమని వ్యాఖ్య**

**అహంకారం, అపోహలను వీడాలని సూచన**

**ఉజ్జయిని, సెప్టెంబర్ 18 (ఉద్యమ కెరటం):** ధర్మం అనేది వృద్ధాప్యంలో మాత్రమే ఆచరించాల్సిన అంశం కాదని, మనిషి పుట్టుక నుంచి మరణం వరకు జీవితంలో భాగంగా ఉంటుందని ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘచాలక్ మోహన్ భాగవత్ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో శుక్రవారం జరిగిన 'యువ ధర్మ సంసద్'లో యువతను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. యువత ధర్మం గురించి ఆలోచిస్తూ, చర్చించడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. గీత, రామాయణం వంటి గ్రంథాలను పదవీ విరమణ తర్వాతే చదవాలనే భావన

# వీళ్లకు స్టూడెంట్స్ వద్దు.. అంధభక్తులే కావాలి

- ప్రశ్నించే విద్యార్థులంటే వ్యవస్థకు భయం: రాహుల్
- విద్య, ఉద్యోగాలు, పేపర్ లీకులపై యువత గళమెత్తాలని పిలుపు
- రాజ్యాంగ సంస్థల పనితీరును ప్రశ్నించాలని సూచన
- సమస్యలను రాహుల్ ముందుంచిన విద్యార్థులు
- భయపడకుండా హక్కుల కోసం నిలబడాలని పిలుపు



**ఇండోర్, సెప్టెంబర్ 19 (ఉద్యమ కెరటం):** "విద్యార్థి సహజంగానే ప్రశ్నిస్తాడు.. కొత్త విషయాలను తెలుసుకోవాలని ప్రయత్నిస్తాడు. అందుకే ప్రస్తుత వ్యవస్థకు విద్యార్థులంటే భయం. వీళ్లకు ప్రశ్నించే స్టూడెంట్స్ వద్దు.. చెప్పినదాన్ని గుడ్డిగా నమ్మే అంధభక్తులే కావాలి" అంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో శనివారం నిర్వహించిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. విద్య, ఉపాధి, నియామక పరీక్షలు, పేపర్ లీకులు తదితర అంశాలపై మాట్లాడారు. విద్యార్థుల్లో జిజ్ఞాస, ప్రశ్నించే తత్వం ఉంటుందని, భిన్నమైన ఆలోచనలను అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తారని రాహుల్ పేర్కొన్నారు. అయితే ప్రశ్నించని వారినే ప్రస్తుత వ్యవస్థ ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. యువతలో ప్రశ్నించే స్వభావాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం సహా రాజ్యాంగబద్ధ సంస్థల పనితీరుపైనా యువత ప్రశ్నలు సంధించాలని రాహుల్ సూచించారు. విద్యాసంస్థల్లో సమస్యలు, నిరుద్యోగం, నియామకాల్లో జాప్యం, పేపర్ లీకుల వంటి అంశాలపై మౌనంగా ఉండకుండా గళమెత్తాలని పిలుపునిచ్చారు. వ్యవస్థపై తాను చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలు రాజకీయ విమర్శలేనని సంబంధిత వార్తా కథనాలు పేర్కొన్నాయి. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు తమ సమస్యలను రాహుల్ దృష్టికి తీసుకువచ్చారు. పరీక్షలు సకాలంలో జరగకపోవడం, ఉద్యోగ ఖాళీల భర్తీలో జాప్యం, విద్యార్థుల ఆందోళనలపై కేసులు, హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కొరత వంటి అంశాలను ప్రస్తావించారు. కొన్ని ప్రాంతాల్లో ఆరోగ్య, విద్యా సదుపాయాల కొరతపైనా విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. యువత భయపడకుండా ప్రశ్నించాలని, తమ హక్కులు, విద్య, ఉపాధి అవకాశాల కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో గొంతెత్తాలని రాహుల్ పిలుపునిచ్చారు. "విద్య విలాసం కాదు.. హక్కు" అని పేర్కొంటూ సమర్థమైన విద్యా వ్యవస్థను అందించడం ప్రభుత్వ బాధ్యతని వ్యాఖ్యానించారు.

# ఢిల్లీ వర్సిటీలో ఏబీవీపీ హవా

**నాలుగింట మూడు కీలక పదవులు కైవసం**

**అధ్యక్షుడిగా యశ్ దబాస్.. ఉపాధ్యక్షుడిగా స్వతంత్ర అభ్యర్థి దీపాంశు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 (ఉద్యమ కెరటం):** ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాలుగు ప్రధాన పదవుల్లో మూడింటిని కైవసం చేసుకుంది. అధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులను ఏబీవీపీ అభ్యర్థులు గెలుచుకోగా, ఉపాధ్యక్ష పదవిలో స్వతంత్ర అభ్యర్థి దీపాంశు షోకీన్ విజయం సాధించారు. కాంగ్రెస్ అనుబంధ ఎన్‌ఎస్‌యూఐకి కేంద్ర ప్యానెల్‌లో ఒక్క పదవీ దక్కలేదు. అధ్యక్ష పదవికి ఏబీవీపీ అభ్యర్థి యశ్ దబాస్ 24,576 ఓట్లు సాధించారు. ఎన్‌ఎస్‌యూఐ అభ్యర్థి విజయ్ శంకర్ మీనాకు 22,523 ఓట్లు రాగా, 2,053 ఓట్ల ఆధిక్యంతో దబాస్ విజయం సాధించారు. ఉపాధ్యక్ష పదవికి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన దీపాంశు షోకీన్ 30,615 ఓట్లతో గెలుపొందారు. ఆయన సమీప ప్రత్యర్థి ఏబీవీపీకి చెందిన ఇషు మౌర్యకు 16,910 ఓట్లు వచ్చాయి. కార్యదర్శి పదవిని ఏబీవీపీ అభ్యర్థి రియా ఛాఫ్దీ 21,650 ఓట్లతో దక్కించుకున్నారు. ఎన్‌ఎస్‌యూఐ అభ్యర్థి నమ్రతా చౌదరికి 14,869 ఓట్లు వచ్చాయి. సంయుక్త కార్యదర్శి పదవిలో ఏబీవీపీ అభ్యర్థి లక్ష్య రాజ్ సింగ్ విజయం సాధించారు. ఈ స్థానంలో తుది ఓట్ల సంఖ్యపై వార్తా సంస్థల కథనాల్లో స్వల్ప వ్యత్యాసం కనిపిస్తోంది–కొన్ని కథనాలు 16,615గా, మరికొన్ని 16,641గా పేర్కొన్నాయి. ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని 52 కేంద్రాల్లో జరిగిన పోలింగ్‌లో 40.46 శాతం ఓటింగ్ నమోదైంది. ఫలితాల లెక్కింపు ఉత్తర క్యాంపస్‌లోని యూనివర్సిటీ స్పోర్ట్స్ స్టేడియం మల్టీపర్పస్ హాల్‌లో 20 రౌండ్లపాటు సాగింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో విజేతలు, వారి మద్దతుదారులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకుండా ఆంక్షలు విధించారు. భారీ భద్రత మధ్య ఓట్ల లెక్కింపు పూర్తయింది.

# గురుకులాల్లో నాసిరకం సరుకులపై ఆగ్రహం

- రూ.900 కోట్ల కాంట్రాక్ట్‌పై సమగ్ర విచారణ జరిపించాలి




**ఉద్యమ కెరటం, ఖమ్మం:** గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు నాసిరకం నిత్యావసర సరుకులు సరఫరా చేస్తున్నారని తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్ట్ జేఏసీ జిల్లా కన్వీనర్ ఉదయ్ స్వరో వారియర్ ఆరోపించారు. ఖమ్మం జిల్లా ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బ్లాక్‌లిస్ట్‌లో ఉన్నట్లు పేర్కొంటున్న నేకాఫ్ సంస్థకు రూ.900 కోట్ల విలువైన నిత్యావసర సరుకుల కాంట్రాక్ట్ ఎలా అప్పగించారో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. జీఓ నం.17ను రద్దు చేసి, సిట్ ఏర్పాటు చేయడంతో పాటు హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. గురుకుల విద్యార్థులకు నాణ్యత లేని గోధుమ పిండి, పప్పులు, నూనెలు సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్ ధరల కంటే అధిక ధరలకు సరుకులు కొనుగోలు చేస్తున్నట్లు చూపుతుండడంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని విమర్శించారు. విద్యార్థులకు నిర్దేశిత మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందేలా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. గతంలో సరుకుల నాణ్యతను పరిశీలించేందుకు అధికారులు, ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కమిటీలు ఉండేవని, ప్రస్తుతం కేంద్రీకృత టెండర్ల విధానం అమలు చేస్తున్నారని తెలిపారు. వారానికి ఐదు రోజులు అందించాల్సిన కోడిగుడ్ల సరఫరా రెండు, మూడు రోజులకు పరిమితమవుతోందని ఆరోపించారు. నేకాఫ్ సంస్థకు కాంట్రాక్ట్ మంజూరు చేసిన విధానాన్ని ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్‌ను వెంటనే వెనక్కి తీసుకోకపోతే తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేఏసీ కోకన్వీనర్ కంకణాల శ్రీనాథ్, స్వేరోస్ నాయకులు దామెర్ల పృథ్వీరాజ్, బిక్క వెంకటేశ్వర్లు, తల్లిదండ్రుల సంఘం జిల్లా అధ్యక్షుడు నారపోగు నాగయ్య, కొండ్రు రామచంద్రు, సోలెపోగు శ్యాంసుందర్, సాయి, ప్రేమ్‌కుమార్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**ఉద్యమ కెరటం, ఖమ్మం:** యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్–2027 పరీక్షకు సిద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఎస్టీ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో ఉచిత సమగ్ర శిక్షణ అందించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఫిరంగి తెలిపారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ, శ్రీరామ్స్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా 100 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఎస్టీ అభ్యర్థులు 75 మంది, ఎస్సీ 15 మంది, బీసీ 10 మంది ఉంటారని వివరించారు. గత ఐదేళ్లలో ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన ఎస్టీ అభ్యర్థుల్లో మరో 20 మందిని ఎంపిక చేసి మొత్తం 120 మందికి శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, వయస్సు 21 నుంచి 32 సంవత్సరాల మధ్య ఉండాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులకు 35 ఏళ్ల వరకు వయోపరిమితి సడలింపు ఉంటుందని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలలోపు ఉండాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఎనిమిది నెలల పాటు ఉచిత వసతి, భోజనంతో పాటు అధ్యయన సామగ్రిని అందించనున్నట్లు వివరించారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు ఈనెల 23 వరకు గడువు ఉందని, ప్రవేశ పరీక్షను ఈనెల 27న నిర్వహించనున్నట్లు తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూలు అక్టోబర్ 1న, ఎంపిక జాబితా అక్టోబర్ 2న ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ తరగతులు అక్టోబర్ 5 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడంతో పాటు ఇతర వివరాల కోసం https://welfare.sriramsias.com వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

# సాయిస్ఫూర్తి కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలోని సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని ఇంజనీరింగ్ విభాగాల నూతన విద్యార్థుల స్వాగత వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై నూతన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ పుటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ నూతన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలకడం, వారిలో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతను పెంపొందించడం ఫ్రెషర్స్ డే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు పరస్పరం స్నేహభావంతో మెలుగుతూ చదువులో ఒకరికొకరు సహకరించుకోవాలని సూచించారు. నాలుగేళ్ల ఇంజనీరింగ్ విద్యను క్రమశిక్షణతో, కష్టపడి అభ్యసిస్తే ఉన్నత భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని పేర్కొన్నారు. కళాశాల చైర్మన్, రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, వైస్ చైర్మన్ విద్యా ట్రస్టీ బండి అన్విద వర్చువల్ విధానంలో పాల్గొని నూతన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉప ప్రధానాచార్యుడు డాక్టర్ షేక్ యాకూబ్, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ షేక్ మీరాసాహెబ్,



వివిధ ఇంజనీరింగ్ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనాలకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

జిల్లా ఎస్పీ పరితోష్‌పంకజ్

**ఉద్యమ కెరటం, హత్నూర:** వినాయక నిమజ్జనాలు, శోభాయాత్రలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. శనివారం హత్నూర మండలంలోని దౌల్తాబాద్, బోరపట్ల గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు నిర్వహించనున్న చెరువులను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బారికేడింగ్, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా క్రేన్లు, గజ ఈతగాళ్లను



అందుబాటులో ఉంచాలని సూచించారు. శోభయాత్రలు సాగే మార్గాల్లో రోడ్ల పరిస్థితిని పరిశీలించి అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో భద్రత లైటింగ్, బారికేడింగ్ తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్పీ వెంట హత్నూర తహశీల్దార్ ఫర్వీన్ షేక్, సీఐ రమణారెడ్డి, ఎస్సై శ్రీధర్‌రెడ్డి, ఆర్ఐ రంగయ్య, ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్, స్థానిక సర్పంచులు, నాయకులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చి మొక్కల తొలగింపు చేపట్టిన సర్పంచ్

**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని ఊసేగాం గ్రామ పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శనివారం తొలగించే పనులను చేపట్టారు. ముఖ్యంగా రహదారుల పక్కన అధికంగా పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కల కారణంగా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా వాటిని తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా ఊసేగాం సర్పంచ్ ఆత్రం నిర్మల సేసేపాల్ పనులను పరిశీలించారు. గ్రామంలోని రహదారుల పక్కన, ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రహదారులపై ప్రయాణించే వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ తెలిపారు.



## ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం

- పోలీస్‌కమిషనర్ గోష్‌ఆలం
- తెలంగాణ చౌక్, మంచిర్యాల చౌరస్తాలో నూతన ట్రాఫిక్ ఔట్‌పోస్ట్ బూత్‌ల ప్రారంభం

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా తెలంగాణ చౌక్, మంచిర్యాల చౌరస్తాలో ఏర్పాటు చేసిన నూతన ట్రాఫిక్ ఔట్‌పోస్ట్ బూత్‌లను శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నగరంలోని రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను నియంత్రించడంతో



పాటు నిరంతరం పర్యవేక్షించేందుకు ఔట్‌పోస్ట్ బూత్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రయాణికులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామితో పాటు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వంజిరిలో గ్రామంలో రేషన్ స్మార్ట్ కార్డు ల పంపిణీ



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ మండలం వంజిరి గ్రామపంచాయతీ పరిధిలో శనివారం రేషన్ లబ్ధిదారులకు నూతన రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లక్ష్మి, ఉప సర్పంచ్ భరత్, రేషన్ డీలర్ లీలా పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న రేషన్ స్మార్ట్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, రేషన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## వినాయక మండపం వద్ద సామూహిక కుంకుమార్చన



**ఉద్యమ కెరటం, తాండూర్:** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తాండూర్ ఐబీలోని శ్రీ గణేష్ మండలి వినాయక మండపం వద్ద శనివారం మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజారి గౌతమ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహిళలు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వినాయక మండపం వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం శ్రీ గణేష్ మండలి నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అన్నప్రసాదాలను స్వీకరించారు.

## కేజీబివి పాఠశాలలో స్వచ్ఛతా సేవా కార్యక్రమం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** నేరడిగొండ మండలంలోని కేజీబీవీ పాఠశాలలో శనివారం స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ లో భాగంగా స్వచ్ఛతా సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ జిల్లా డిసీబీఎమ్ కోఆర్డినేటర్ చంపత్ జాదవ్ హాజరయ్యారు. ఎస్ డబ్ల్యూఎం 2026 సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ ప్రకారం ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు గ్రామంలో కూడా స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం సంబరాలు

**ఉద్యమ కెరటం, తాండూర్:** మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసం సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.రమాదేవి మాట్లాడుతూ చిన్నారుల పోషణ, సంరక్షణలో తండ్రులు, కుటుంబ సభ్యుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. పిల్లల జీవితంలోని తొలి వెయ్యి రోజుల్లో మెదడు అభివృద్ధి, ఆరోగ్యకరమైన ఎదుగుదలపై తండ్రులు, గ్రామ వార్డుల్లోని ఇతర పురుష సభ్యులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యవంతమైన పిల్లల తల్లులు, పోషకాహార లోపం ఉన్న పిల్లల తల్లుల మధ్య అనుభవాలను పంచుకునేలా ప్రత్యేక సమావేశం నిర్వహించారు.



అనంతరం చేతుల పరిశుభ్రతపై హ్యాండ్‌వాష్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మామిడాల లలిత రాజేశం, ఉప సర్పంచ్ సుభాష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు, పిల్లలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# చిన్ననాటి నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

• జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య



**ఉద్యమ కెరటం, హత్నూర:** చిన్ననాటి నుంచే విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య సూచించారు. హత్నూర మండలం సిరిపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, బాలల హక్కులపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బాల్య వివాహాల నిరోధం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల రక్షణ, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలలపై వేధింపులు, అనుచిత ప్రవర్తన చోటుచేసుకుంటే మౌనం వహించకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, పాస్‌వర్డ్ లు, వ్యక్తిగత వివరాలు, ఫొటోలను అపరిచితులతో పంచుకోరాదని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు, లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన, పరస్పర గౌరవం, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవర్చుకొని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీధర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ భూపాల్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఫైనాన్స్ వేధింపులకు యువకుడు బలి

## పోలీసులకు తండ్రి ఫిర్యాదు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ఫైనాన్స్ కంపెనీ వేధింపులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నేరడిగొండ మండలంలో చోటుచేసుకుంది. ఈ మేరకు మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని సావర్గం గ్రామానికి చెందిన బాధవ్ కిషన్ తన ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం... తన నడిపి కొడుకు జాధవ్ అనిల్(35) కొరటికల్(బి) గ్రామ పోస్టాఫీసులో గత 4 సంవత్సరాలుగా ఆఫీస్ బాయ్ గా పని చేస్తున్నాడు. ఎలక్ట్రానిక్ ఫైనాన్స్ నుంచి లోన్లు తీసుకుని నెలనెలా ఈఎంఐలు కడుతున్నాడు. అకౌంట్ ఫ్రీజ్ కావడంతో గత నెల ఈఎంఐ కట్టలేకపోయాడు. దీంతో ఫైనాన్స్ సిబ్బంది ఇంటికి వచ్చి ఈఎంఐ కట్టాలని బెదిరించారని, దీంతో మనస్థాపానికి గురయ్యాడని తండ్రి తెలిపారు. ఈనెల 19న విధులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చిన అనిల్ ను తిరిగి వెళ్తుండగా గ్రామ శివారులో ఫైనాన్స్ వారు అడ్డగించి ఈఎంఐ కట్టాలని బెదిరించారని, వారి బెదిరింపులు భరించలేక ఇంటికి వచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కొడుకు మృతికి కారణమైన ఫైనాన్స్ సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తండ్రి బాధవ్ కిషన్ నేరడిగొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా అమన్ జిత్ సింగ్



**ఉద్యమ కెరటం, కరీంనగర్:** కరీంనగర్ పట్టణంలోని సిక్కువాడకు చెందిన కాంగ్రెస్ నాయకుడు అమన్ జిత్ సింగ్‌ను జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం రేకుర్తిలోని తన క్యాంపు కార్యాలయంలో అమన్ జిత్ సింగ్‌కు శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం, అన్ని మతాలు, వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే సిక్కు మైనార్టీకి చెందిన అమన్ జిత్ సింగ్‌కు జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతంతో పాటు సిక్కు మైనార్టీల హక్కులు, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సిక్కు మైనార్టీలతో పాటు అన్ని వర్గాలకు విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం అమన్ జిత్ సింగ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, మంత్రులు, కాంగ్రెస్ ముఖ్య నేతలు, సీనియర్ నాయకులు, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు. అమన్ జిత్ సింగ్ నియామకంపై కరీంనగర్ సిక్కు సమాజం, మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

# ఘనంగా వినాయక నవరాత్రి పూజలు





**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూర్ మండలం దిద్దుపూడి గ్రామంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం వినాయకుడికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద విజయ్‌కుమార్ హాజరై గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అనంతరం డాక్టర్ మట్టా దయానంద విజయ్‌కుమార్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. దీంతో గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి, వేంసూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం



**ఉద్యమ కెరటం, బోథ్:** కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు బోథ్ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మేరుగు భోజన్న తెలిపారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా బోథ్ మండలంలోని 21 గ్రామాలకు నూతన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులను నియమించినట్లు తెలిపారు. ఏఐసీసీ, టీపీసీసీ, డీసీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేసేందుకు ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన గ్రామ అధ్యక్షులు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం నూతన అధ్యక్షులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కుర్మే మహేందర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆశన్న, అంజయ్య, అచ్యుత్‌రెడ్డి, కౌసర్, అబూద్, ఉమేష్ జాదవ్, బొడ్డు గంగారెడ్డి, మేరుగు నరసింహాదాస్, చాట్ల ఉమేష్, షేక్, బొజ్జ సాయన్న, అలీం, జగన్, అబ్రార్, అమీరోదిన్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ‘డబుల్ ఇళ్ల కు అవసరమైన మరమ్మతులు చేయించాలి

## జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**ఉద్యమ కెరటం, కరీంనగర్:** కరీంనగర్, హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గృహ నిర్మాణ శాఖ, ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రస్తుత పరిస్థితి, చేపట్టాల్సిన మరమ్మతులు, పరిసరాల పరిశుభ్రత, నీరు, విద్యుత్, రోడ్లు తదితర కనీస వసతుల కల్పనపై అధికారులతో చర్చించారు. ఇళ్ల పరిసరాలను శుభ్రం చేయించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు అందించిన అనంతరం ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన పనులను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ డీఈ ప్రవీణ్, ఆర్ అండ్‌బీ డీఈ శ్రీకాంత్, జేఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల్లో చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదిలాబాద్ పట్టణంలోని పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ శనివారం సందర్శించారు. ఆయా మండపాల వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో దంపతులు పాల్గొని గణనాథునికి ప్రత్యేక హారతులు సమర్పించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, ఆదిలాబాద్ పట్టణం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఉత్సవాల సందర్భంగా మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకుని శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు తదితర కనీస వసతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, వివిధ వార్డుల గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, వార్డు ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

# డీజేకు అనుమతి లేదు

• రూ.60 వేల అడ్వాన్స్ తిరిగి ఇప్పించిన మాచారెడ్డి పోలీసులు

**ఉద్యమ కెరటం, కామారెడ్డి:** గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజే ఏర్పాటుకు అనుమతి లేకపోవడంతో ముందుగా చెల్లించిన రూ.60వేల అడ్వాన్స్ మొత్తాన్ని తిరిగి ఇప్పించి మాచారెడ్డి పోలీసులు ప్రజల సమస్యకు పరిష్కారం చూపారు. మాచారెడ్డి మండలం అక్కాపూర్ గ్రామానికి చెందిన ఆదర్శ్ యూత్ గణపతి మండల అధ్యక్షుడు గడ్డం శ్రీకాంత్ సుమారు 15 రోజుల క్రితం ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన లడ్డు ఆర్‌ఆర్‌ఆర్ డీజే నిర్వాహకుడికి రూ.60వేలు అడ్వాన్స్‌గా చెల్లించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా డీజే వినియోగానికి అనుమతి లేదని తెలియడంతో తాను చెల్లించిన అడ్వాన్స్ మొత్తాన్ని తిరిగి ఇప్పించాలని శ్రీకాంత్ మాచారెడ్డి పోలీసులను ఆశ్రయించారు. దీనిపై స్పందించిన మాచారెడ్డి ఎస్సై కొండా విజయ్ డీజే నిర్వాహకుడితో మాట్లాడి శ్రీకాంత్ చెల్లించిన రూ.60వేల మొత్తాన్ని పూర్తిగా తిరిగి ఇప్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నిబంధనలను కఠినంగా అమలు చేస్తూనే, ప్రజలకు ఎదురయ్యే సమస్యలకు మానవీయ దృక్పథంతో పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. నిబంధనలు చెప్పడమే కాకుండా ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడమే పోలీసుల బాధ్యత అనే సందేశాన్ని చాటిచెప్పారు.




# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**ఉద్యమ కెరటం, తాండూర్:** బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్‌రావు ఆధ్వర్యంలో తాండూర్ మండలం అచలాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను శనివారం పంపిణీ చేశారు. అచలాపూర్ గ్రామానికి చెందిన దాగం కృష్ణవేణికి రూ.52వేలు, రావుల విష్ణువర్ధన్‌కు రూ.60వేల చొప్పున మొత్తం రూ.1.12 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బండి పోషం, వార్డు సభ్యులు దాగం పోచయ్య, అక్కపెల్లి రజిత, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, వరిమడ్ల తిరుపతి, పుప్పాల రమేష్, దుర్గం తిరుపతి, బూత్ కమిటీ సభ్యుడు అభిరామ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# బోథ్ కాంగ్రెస్ శ్రేణులకు దిక్సూచిగా ఆడే గజేందర్

- ప్రజాసేవకే అంకితం.. స్థానిక సంస్థల బలోపేతానికి కృషి

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా ప్రజల మధ్య ఉంటూ, స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేస్తున్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు ఆడే గజేందర్ పార్టీ శ్రేణులకు దిక్సూచిగా నిలుస్తున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. పదవులను ప్రజాసేవకు లభించిన అవకాశాలుగా భావిస్తూ నియోజకవర్గంలో నిరంతరం ప్రజా సమస్యలపై



స్పందిస్తున్నారని తెలిపారు. రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడిగా గజేందర్ గ్రామగ్రామాన పర్యటిస్తూ స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేస్తున్నారని, సర్పంచులు, వార్డు సభ్యుల సమస్యలు, హక్కుల సాధన కోసం వారి తరపున నిలుస్తున్నారని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నారని తెలిపారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమేనని, ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తున్నారని పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో ఎవరికి ఆపద వచ్చినా అండగా నిలుస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. ఆయన పిలుపునకు యువత, పార్టీ కార్యకర్తలు స్పందిస్తూ కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల ఏఐసీసీ సభ్యుడు సచిన్ సావంత్‌తో ఆడే గజేందర్ భేటీ అయ్యారు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు, స్థానిక సంస్థల బలోపేతం తదితర అంశాలపై చర్చించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తూ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

# ఘనంగా గణేష్ నిమజ్జన వేడుకలు

- వినాయక మండపాల్లో యాదగిరి సునీల్‌రావు ప్రత్యేక పూజలు

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** నగరంలోని భగత్‌నగర్‌లో డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఐదు రోజులుగా పూజలందుకున్న గణనాథుడి నిమజ్జన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించగా, ఐదో రోజు నిమజ్జనానికి ముందు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భగత్‌నగర్, కాశ్మీర్‌గడ్డ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పలు గణేష్ మండపాలను యాదగిరి సునీల్‌రావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఫండస్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం, శ్రీ కపిలేశ్వర స్వామి ఆలయంలోని విఘ్నేశ్వరుడు, భగత్‌నగర్‌లో ఆదర్శ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని దర్శించుకున్నారు. ఆయా మండపాల వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణలో పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీదేవి–చంద్రమౌళి, ఫండస్ స్కూల్ యాజమాన్యం పద్మజ–ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కస్తూరి నాగరాజు, కేశవరెడ్డి, శంకరయ్య, కనకయ్య, ఆదర్శ యూత్ క్లబ్ సభ్యులు, స్థానిక



నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి కృషి

- మున్నూరు కాపు సంఘం జిల్లా యూత్ అధ్యక్షులు గాజుల రాజేంద్ర ప్రసాద్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి కృషి చేస్తానని నూతనగా ఎన్నుకోబడిన మున్నూరు కాపు సంఘం జిల్లా యూత్ అధ్యక్షులు గాజుల రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయనను మున్నూరు కాపు సంఘం నాయకులు శాలువ,పూలమాల తో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపు లందరు ఆన్లైన్ యాప్ ద్వారా సభ్యత్వ



నమోదు చేసుకోవాలని అన్నారు, అందరూ ఐక్యమైత్యంతో ఉండి హక్కులను సాధించుకోవాలని అన్నారు. మున్నూరు కాపు సంఘం కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్, ఎమ్మెల్సీ దండే విఠల్ సహకారంతో జిల్లా కేంద్రంలో భవన నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు సుంకరి పెంటయ్య, గాజుల సత్యనారాయణ, రుకుం ప్రహ్లాద్, అడప సతీష్, మనిగొండ సంతోష్, మేకర్తి లచ్చన్న, అడప అశోక్, మేకర్తి ప్రశాంత్, సైధం తిరుపతి, విజయ్, సందీప్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి సర్పంచులు ముందుకు సాగాలి





- ఏఐసీసీ సెక్రెటరీ సచిన్ సావంత్
- ఆసిఫాబాద్ నియోజకవర్గ సర్పంచుల శిక్షణ శిబిరం

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** గ్రామాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగాలని ఏఐసీసీ సెక్రెటరీ సచిన్ సావంత్ అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని రోజ్ ఫంక్షన్ హాల్ లో ఆసిఫాబాద్ నియో జకవర్గ పరిధిలోని సర్పంచులకు రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ శిక్షణ కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో స్థానిక సంస్థలు, ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమన్నారు. గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలన్నారు. రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ తెలంగాణ ఇన్ చార్జి, నేషనల్ సెక్రెటరీ బి. సుభాష్ యక్కర మాట్లా డుతూ పంచాయతీరాజ్ వ్యవస్థ లక్ష్యాలు, గ్రామస్థా యిలో స్థానిక పాలన ప్రాధాన్యత, సర్పంచులు నిర్వహించాల్సిన బాధ్యతలపై సర్పంచులకు అవ గాహన కలిగి ఉండాలన్నారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేలా సర్పంచులు చొరవ చూపాలన్నారు. గ్రామసభలను సక్రమంగా నిర్వహిస్తూ ప్రజల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు సర్పంచులు ప్రజలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ ఇంచార్జి శ్యాంనాయక్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు కీలకపాత్ర పోషించాలని అన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విట్టల్, గ్రంథాలయం చైర్మన్ అనిల్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్ రావు, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోరే సంతోష్, ఎస్సి సెల్ జిల్లా చైర్మన్ సుద్దాల శ్రీనివాస్, జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్ అర్షద్ హుస్సేన్, మండలాల అధ్యక్షులు, డీసీసీ కార్యవర్గం సభ్యులు, ఆర్ జీ పీ ఆర్ ఎస్ రాష్ట్ర చైర్మన్ మార్కా రాజేంద్ర ప్రసాద్ యాదవ్, జిల్లా కో ఆర్డినేటర్ కోవ ఇందిర, ప్రోగ్రాం కోఆర్డినేటర్ జాఫర్, జోనల్ కో ఆర్డినేటర్ నవీన్, నేషనల్ ట్రైనర్ జ్యోత్స్న నాయక్, నేషనల్ ట్రైనర్ సమీనా, సర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాలను సందర్శించిన పోలీస్ కమిషనర్

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని బెల్లంపల్లి పట్ట ణంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపాల నిర్వాహకులతో మాట్లాడి గణేష్ నిమజ్జనానికి చేపడుతున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. మండపాల వద్ద శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిమజ్జనం రోజున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రూరల్ ఇన్స్పెక్టర్ హనోక్, బెల్లంపల్లి పట్టణ పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# తీన్మార్ యూత్ సభ్యులకు టీషర్టుల పంపిణీ



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** వేంసూరు మండలం భరణిపాడు గ్రామంలో తీన్మార్ యూత్ సభ్యులకు టీషర్టులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మందపాటి మహేశ్వరరెడ్డి నాయకత్వంలో మేస్త్రి పరిగడపు విజయ్ టీమ్ సభ్యులకు తనవంతు సహాయంగా టీషర్టులను అందజేశారు. యువతను ప్రోత్సహిస్తూ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత ఐక్యత, స్నేహభావం, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా తీన్మార్ యూత్ సభ్యులు మాట్లాడుతూ తమ టీమ్‌కు టీషర్టులు అందజేసిన మందపాటి మహేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. యువత పట్ల ఆయన చూపుతున్న అభిమానం, సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తీన్మార్ యూత్ సభ్యులు, మేస్త్రి పరిగడపు విజయ్ టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచిత యూనిఫామ్ ల పంపిణీ



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలోని భరణిపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రసాద్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు కూరపాటి శ్రీనివాస రావు, బొంతు మోహనరావు, మందపాటి సత్యనారాయణ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు మెంబర్లు, కమిటీ చైర్మన్, గ్రామ పెద్దలు, పాఠశాల సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, పంచాయతీ సెక్రటరీ, గ్రామపంచాయతీ ఎంపీడబ్ల్యూ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# తన్వీర్ పటేల్‌ను పరామర్శించిన ఆడే గజేందర్



**ఉద్యమ కెరటం, భీంపూర్:** భీంపూర్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్ తన్వీర్ పటేల్‌ను కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన తన్వీర్ పటేల్ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం కోలుకుని భీంపూర్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆడే గజేందర్ శనివారం ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలను పాటిస్తూ తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట గోన ఉప సర్పంచ్, భీంపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముశ్రాన్ అహ్మద్, కాంగ్రెస్ నాయకులు మడవి భీంరావు, బోథ్ అసెంబ్లీ మాజీ అధికార ప్రతినిధి ఎండీ సద్దాం, మౌలానా, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.<

# బోథ్ , బజార్ హత్నూర్ నాయకులకు సన్మానం

**ఉద్యమ కెరటం, బజార్‌హత్నూర్ :** ఇటీవల నూతనంగా నియమితులైన బోథ్ మండల కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ నడికుంట ప్రవీణ్, బజార్‌హత్నూర్ మండల కన్వీనర్ కల్లెం విఠల్‌ను కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా పీఏసీ సభ్యుడు ఏలేటి అశ్విన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



ఈ సందర్భంగా అశ్విన్‌రెడ్డి మాట్లాడుతూ పాత, కొత్త కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, పునర్నిర్మాణానికి ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుడాల అనీష్, సీనియర్ నాయకులు నల్ల శ్రీకాంత్‌రెడ్డి, నారాయణ, నవీన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేసుల దర్యాప్తు లో వేగం పెంచాలి

- పెండింగ్ కేసులు త్వరగా తేల్చాలి
- శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి
- డీఐజీ అంబర్ కిషోర్ ఝా
- ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్, వాంకిడి సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీఐజీ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం పెంచి, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని కాళేశ్వరం జోన్- 1 డీఐజీ అంబర్ కిషోర్ ఝా పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఆసిఫాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్‌తో పాటు వాంకిడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నితికా పంత్, పుష్పగుచ్ఛం అందించి డీఐజీకి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం డీఐజీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, ఆవరణలో మొక్కలు నాటారు. తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలు, రికార్డులు, 5ఎస్ విధానం అమలు తీరును పరిశీలించారు. సర్కిల్ పరిధిలోని తీవ్రమైన నేరాలు, సీడీ ఫైళ్లు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులపై అధికారులతో వివరంగా సమీక్షించారు. జప్తు చేసిన వాహనాలను క్రమబద్ధంగా భద్రపరచి, రికార్డులను సరిగ్గా నిర్వహించాలని స్పష్టం చేశారు. అలాగే సిబ్బంది కిట్లను పరిశీలించి, వారి సమస్యలు, అవసరాలను ఆరా తీశారు. నేరాలకు సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, పక్కా ఆధారాలు సేకరించాలని, కోర్టు ల్లో కేసుల పురోగతికి అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండడంతో పాటు మహిళలు, బాలికల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పట్టణాల్లో ట్రాఫిక్ నిర్వహణను మెరుగు పరచాలని, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, ఎల్లప్పుడూ వారికి అందుబాటులో ఉండి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





## 40వ వార్డు లో రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పట్టణంలోని 40వ వార్డు పరిధిలోని దస్నాపూర్, ధోబీ కాలనీ ప్రజల దీర్ఘ కాలిక సమస్యలకు పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి. డ్రైనేజీ నాళాలు, రోడ్ల సమస్యల పరిష్కారానికి 40వ వార్డు కౌన్సిలర్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సాయి చరణ్ గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆయన ఆధ్వర్యంలో రూ.50 లక్షల నిధులతో నాళాల నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయి చరణ్ గౌడ్ మాట్లాడుతూ దస్నాపూర్, ధోబీ కాలనీల్లో సరైన రోడ్లు, నాళాలు లేక ప్రజలు చాలా కాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వార్డుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన రూ.50 లక్షల పనులతో పాటు ఇతర అత్యవసర సమస్యల పరిష్కారానికి మరో రూ.50 లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్‌కు సమగ్ర నివేదిక అందజేసినట్లు వివరించారు. నిధులు మంజూరైన వెంటనే మిగిలిన అభివృద్ధి పనులను కూడా పూర్తి చేస్తామని తెలిపారు. వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఆయనకు కాలనీ ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు.

## గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్




**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా గంభీరావుపేట చెరువు, ముస్తఫానగర్ చెరువులను ఎస్సై శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి వినీల్ రెడ్డి శనివారం సందర్శించి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువుల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. నిమజ్జన సమయంలో భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్, లైటింగ్, రక్షణ చర్యలు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జన సమయంలో భక్తులు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సహకరించాలని ఎస్సై శ్రీకాంత్ కోరారు. పోలీస్, పంచాయతీ శాఖల సమన్వయంతో నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# డ్రగ్స్ రహిత మండలంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసుల తనిఖీలు





**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేటను మాదకద్రవ్యాల రహిత మండలంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రంలోని వివిధ టీ దుకాణాలు, కిరాణా షాపులు, పాన్ షాపులను శనివారం ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమానాస్పద పదార్థాల విక్రయాలు, నిషేధిత మాదకద్రవ్యాల సరఫరా జరుగుతున్నాయా అనే అంశాలను పరిశీలించారు. దుకాణదారులు ఎలాంటి నిషేధిత పదార్థాలను విక్రయించవద్దని, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్సై శ్రీకాంత్ సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా నిషేధిత డ్రగ్స్ విక్రయాలు, సరఫరాకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గంభీరావుపేట మండలాన్ని డ్రగ్స్ రహిత మండలంగా మార్చేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## పిడుగుపాటుకు రైతు మృతి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూర్ మండల పరిధిలోని లచ్చన్నగూడెం గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. పొలంలో దుక్కి దున్నేందుకు వెళ్లిన పర్సా ఆనందరావు (52) పిడుగు పాటుకు గురై మృతిచెందారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పర్సా ఆనందరావు శనివారం తన పొలంలో దుక్కి దున్నేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం పడుతుండగా పొలంలో పిడుగు పడింది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. విషయం గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే ఆనందరావును చికిత్స నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పిడుగుపాటుతో రైతు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

# గణేష్ నిమజ్జనాల్లో డీజేలకు అనుమతి లేదు

- అడ్వాన్స్ నగదు తిరిగి ఇప్పించేందుకు పోలీసుల చొరవ



**ఉద్యమ కెరటం, మద్నూర్:** గణేష్ నిమజ్జన ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టమ్‌లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి స్పష్టం చేశారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, శబ్ద కాలుష్య నియంత్రణలో భాగంగా మండపాల నిర్వాహకులు, ప్రజలు, డీజే నిర్వాహకులకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మద్నూర్ మండల కేంద్రంలోని కుమార్ గణేష్ మండపాన్ని డీఎస్పీ విఠల్‌రెడ్డి, తహశీల్దార్ ఎండి. ముజీబ్, సీఐ రవికుమార్, బిచ్కుంద ఎస్సై రాజు, మద్నూర్ ఎస్సై మోహన్ రెడ్డి తదితరులు సందర్శించి గణనాథుడిని దర్శించుకుని హారతి ఇచ్చారు. అనంతరం నిమజ్జన శోభయాత్ర వెళ్లే మార్గాన్ని పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.నిమజ్జన ఉత్సవాలకు డీజేలకు అనుమతి లేని నేపథ్యంలో ఎవరైనా ముందుగా డీజే నిర్వాహకులకు అడ్వాన్స్ చెల్లించి ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ సూచించారు. బాన్సువాడ డివిజన్‌లోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో డీజేలకు చెల్లించిన అడ్వాన్స్ నగదును నిర్వాహకులతో మాట్లాడి తిరిగి ఇప్పించేందుకు పోలీసులు చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. నిమజ్జన శోభయాత్రలో విద్యుత్ తీగలు, ట్రాఫిక్, అగ్నిప్రమాద నివారణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్, ఫైర్, విద్యుత్ శాఖల సిబ్బందికి సూచించారు. పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భక్తులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ శాఖకు సహకరించి ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాట్నాలర్ రమేష్, పంచాయతీ కార్యదర్శి సందీప్, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, అగ్నిమాపక సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు, కుమార్ గణేష్ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన డీసీపీ భాస్కర్




**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ అన్నారు. శనివారం బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సీసీటీఎన్ఎస్ ఆన్‌లైన్ నమోదు, స్టేషన్‌నిర్వహణ, రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు. కేసులకు సంబంధించిన వివరాలను సీసీటీఎన్ఎస్‌లో సకాలంలో నమోదు చేయడంతో పాటు, సాక్ష్యాధారాలను డిజిటల్ రూపంలో అప్‌లోడ్ చేయాలని సీఐకి సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు సత్వర, పారదర్శక, నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేరాల నియంత్రణ, రోడ్డు భద్రత, ప్రజలతో సత్సంబంధాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

# సింగరేణిలో డిపార్ట్మెంట్ స్థాయి క్రీడా పోటీలు





**ఉద్యమ కెరటం, మందమర్రి:** మందమర్రి సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో శనివారం సింగరేణి డిపార్ట్మెంట్ స్థాయి క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. ఏరియా పరిధిలోని వివిధ గనులు, డిపార్ట్మెంట్లకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సివిల్ డీజీఎం బాషా, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సెలేంద్ర సత్యనారాయణ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. ఉద్యోగుల మధ్య ఐక్యత, క్రమశిక్షణను పెంపొందించడంలో క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రోజువారీ విధుల్లో ఉద్యోగులు ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో ఇలాంటి క్రీడా పోటీలు వారికి ఉపశమనం కలిగిస్తాయని తెలిపారు. క్రీడాకారులు ప్రతిభను ప్రదర్శించి విజేతలుగా నిలవడంతో పాటు కోల్ ఇండియా స్థాయిలో మందమర్రి ఏరియా ఖ్యాతిని చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీఎం కార్యాలయ సీనియర్ పీఓ సురేందర్, జీఎం కార్యాలయ ఎఫ్ఏడ బ్ల్యూపీఎస్‌జీఏ కార్యదర్శి కార్తీక్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# కేబుల్ టీవీ రంగ సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం

**సీపీఐ ఎల్‌పీ నేత కూనంనేని సాంబశివరావు**

**అర్హులైన కేబుల్ టీవీ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు వచ్చేలా కృషి చేస్తాం: టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరాహత్ అలీ**

**ఉద్యమ కెరటం, హైదరాబాద్ :** తెలంగాణలోని కేబుల్ టీవీ రంగానికి, అందులో పనిచేస్తున్న జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాలపై పోరాడేందుకు కేబుల్ టీవీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సు విజయవంతమైంది. శనివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో బి. నరసింహ చారి, పుదుల వెంకట్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కేబుల్ టీవీ యాజమాన్యాలు, సీఈఓలు, జర్నలిస్టులు, సాంకేతిక సిబ్బంది పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసనసభ సీపీఐ పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కేబుల్ టీవీ యాజమాన్యాలు, జర్నలిస్టులు





ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి పరిష్కారం కోసం ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వంలో జిల్లాకు నాలుగు అక్రిడిటేషన్ కార్డులు ఇస్తే, ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు నిలిపివేసిందో పరిశీలించి, అవసరమైతే అసెంబ్లీలో కూడా గళం విప్పుతానని స్పష్టం చేశారు. కేబుల్ టీవీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సు లో ఆత్మీయ అతిథిగా పాల్గొన్న టీయూడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ఖాజా విరాహత్ అలీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కష్టపడుతున్న అర్హులైన ప్రతి కేబుల్ టీవీ జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు దక్కేలా తన వంతు సహకారాన్ని అందిస్తానని ప్రకటించారు. ప్రత్యేక ఆహ్వానితులు, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ముఖ్యవక్త ఆనంచిన్ని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేబుల్ టీవీ రంగంపై ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన జర్నలిస్టులకు జిల్లా కేంద్రాల్లో 4, హైదరాబాద్‌లో 12 అక్రిడిటేషన్ కార్డులు తక్షణమే మంజూరు చేయాలని కోరారు. సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న కేబుల్ టీవీ ఛానెళ్ల పట్ల ప్రభుత్వం చిన్నచూపు స్వస్తి పలకపోతే రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా సదస్సు ద్వారా ప్రభుత్వం ముందు పలు కీలక డిమాండ్లను ఉంచారు. కేబుల్ టీవీ ఛానెళ్లను వెంటనే ప్రభుత్వ ప్రకటనల కోసం ఎంప్యానెల్ చేయాలని, జిల్లా అక్రిడిటేషన్ కమిటీల్లో కేబుల్ టీవీ ప్రతినిధులకు చోటు కల్పించాలని, అర్హులైన కేబుల్ జర్నలిస్టులందరికీ వెంటనే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో కేబుల్ టీవీ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు.

# ఆకస్మిక తనిఖీతో హడల్

**అనుమతి లేకుండా గైర్హాజరైతే వేటు తప్పదు**

**కలెక్టర్ కె.హరిత హెచ్చరిక**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ప్రజాసేవే పరమావధిగా పనిచేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, సరైన అనుమతి లేకుండా గైర్హాజరయ్యే అధికారులైనా, సిబ్బందియైనా వారిపై కఠిన చర్యలు తప్పవని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంక్షేమ సంస్థల్లో బాధ్యతాయుతమైన వాతావరణాన్ని పెంపొందించేందుకు ఆమె ప్రత్యేక దృష్టి సారించారు.

**వైద్య కళాశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలను కలెక్టర్ హరిత ఆకస్మికంగా సందర్శించారు. కళాశాల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న బోధన, వైద్య సేవల తీరును పరిశీలించిన అనంతరం ఆసుపత్రి/కళాశాల హాజరు పట్టికను నిశితంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఎలాంటి ముందస్తు సమాచారం, ఉన్నతాధికారుల అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్ల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**డీఎంఈ అధికారులకు నేరుగా ఫోన్..**

**తక్షణ చర్యలకు ఆదేశం**

గైర్హాజరైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిర్లక్ష్యంపై తీవ్రంగా స్పందించిన కలెక్టర్, వెంటనే చరవాణి (ఫోన్) ద్వారా





డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీ ఏం ఈ) ఉన్నతాధికారులతో మాట్లాడారు. నిబంధనలను ఉల్లంఘించి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సదరు ప్రొఫెసర్లపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**సమయపాలన దాటితే ఉపేక్షించేది లేదు**

ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ ప్రజలకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ హరిత హెచ్చరించారు. ప్రతి అధికారి, ఉద్యోగి, కిందిస్థాయి సిబ్బంది నిర్ణీత సమయానికి విధులకు హాజరుకావాలని ఆదేశించారు. తరచూ విధులకు గైర్హాజరవుతూ ప్రజా సేవలకు విఘాతం కలిగించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, సర్వీసు నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ వెంకన్న, వివిధ విభాగాల ప్రొఫెసర్లు, అధ్యాపకులు పరిపాలనా సిబ్బంది పాల్గొన్నారు.




# కలెక్టర్ హృదయస్పందన

## బోడేపల్లి మల్లయ్యకు దక్కిన ఆదరణ!

**ఆపదలో కలెక్టరేట్‌కు వచ్చిన వృద్ధుడిని సొంత మనిషిలా పరామర్శించిన జిల్లా కలెక్టర్ కె. హరిత**

**అధికారుల కౌన్సిలింగ్‌తో తప్పు తెలుసుకుని, తండ్రిని ఆప్యాయంగా ఇంటికి తీసుకెళ్లిన కుమారుడు**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** వృద్ధాప్యంలో ఆసరాగా నిలవాల్సిన కన్న పేగు దూరమై, బతుకు భారమై కలెక్టరేట్ ముంగిటకు చేరిన ఓ వృద్ధుడికి జిల్లా యంత్రాంగం కొండంత అండగా నిలిచింది. జిల్లా కలెక్టర్ కె. హరిత చూపిన మానవతా దృక్పథం, సమయానుకూల చొరవతో ఆ వృద్ధుడి ఆవేదనకు తెరపడి, తిరిగి కుటుంబ సభ్యుల ప్రేమరాగాల ఒడికి చేరింది. కాగజ్ నగర్ మండలం బోడేపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య అనే వృద్ధుడిని అతని కుమారుడు సరిగా పట్టించుకోకపోవడంతో, పోషణ కరువై తీవ్ర మానసిక ఆవేదనకు గురయ్యాడు. వేరే దారి లేక ఈ నెల 18న తన బాధను చెప్పుకోవడానికి సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చాడు. ఈ విషయం కలెక్టర్ కె. హరిత దృష్టికి వెళ్లగానే ఆమె క్షణం కూడా ఆలస్యం చేయకుండా స్పందించారు. స్వయంగా మల్లయ్య వద్దకు వెళ్లి ఆయన సమస్యలను, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే ఆయనకు రక్షణ, సురక్షిత వసతి కల్పించాలని అధికారులను ఆదేశించి, వృద్ధుడి సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించారు.

**మారుమనస్సు పొందిన కుమారుడు**

జిల్లా యంత్రాంగం స్పందించిన తీరు, కలెక్టర్ ఆదేశాల సమాచారం తెలుసుకున్న వృద్ధుడి కుమారుడిలో మార్పు వచ్చింది. తండ్రి సంరక్షణ బాధ్యతను పూర్తిగా తానే స్వీకరిస్తానని, ఇకపై ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రేమగా, సంతోషంగా చూసుకుంటానని అధికారులకు హామీ ఇచ్చాడు. ఈ నేపథ్యంలో కలెక్టర్ స్వయంగా కుమారుడికి కౌన్సిలింగ్ ఇచ్చారు. "వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఆదరించడం, వారి అవసరాలు తీర్చడం ప్రతి బిడ్డ ప్రాథమిక బాధ్యత. వృద్ధులు కుటుంబానికి భారం కాదు, మనకు మార్గదర్శకులు. వారి గౌరవం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి" అని హితవు పలికారు.

**కళ్లల్లో ఆనంద భాష్పాలు:**

కుమారుడు తనను ఆప్యాయంగా ఇంటికి తీసుకెళ్లడంతో వృద్ధుడు మల్లయ్య తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. కలెక్టర్ చొరవతో తన సమస్య తీరిందని, మళ్లీ కుటుంబంతో కలిసి బతికే అవకాశం దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. కలెక్టర్ చూపిన ఈ మానవత పై స్థానికులు, ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.




# రోహిత్, కోహ్లీ నుంచి పరుగులే ఆశిస్తున్నాం

## ఆకాశ్ చోప్రా




న్యూఢిల్లీ సెప్టెంబరు 19 :

2027 వన్డే ప్రపంచకప్‌కు మరో ఏడాది మాత్రమే సమయం ఉన్నందున, సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల నుంచి ప్రధానంగా పరుగులు మాత్రమే ఆశిస్తున్నామని భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా వ్యాఖ్యానించాడు. వెస్టిండీస్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌కు రోహిత్, కోహ్లీ ఇద్దరూ ఎంపికైన నేపథ్యంలో ఆకాశ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. వీరు ఫామ్‌లో ఉంటే ఒంటిచేత్తో మ్యాచ్‌లను గెలిపించగలరని పేర్కొన్నాడు. వెస్టిండీస్‌తో సిరీస్‌కు ఎంపిక చేసిన 15 మంది సభ్యుల భారత జట్టుపై చోప్రా సంతృప్తి వ్యక్తం చేశాడు. రిషబ్ పంత్ స్థానంలో రెండో వికెట్ కీపర్‌గా ధ్రువ్ జురెల్‌ను ఎంపిక చేయడం సరైన నిర్ణయమని కొనియాడాడు. హార్దిక్ పాండ్యా అందుబాటులో లేని సమయంలో నితీశ్ కుమార్ రెడ్డిని తీసుకోవడం జట్టుకు కలిసివస్తుందన్నాడు. ఇక ఆల్‌రౌండర్ల విభాగంలో రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌ల మధ్య తీవ్ర పోటీ ఉందని, 2027 ప్రపంచకప్ నాటికి ఈ ముగ్గురిలో ఒకరికే అవకాశం దక్కవచ్చని అంచనా వేశాడు. కాగా, భారత జట్టు సెప్టెంబర్ 27న తిరువనంతపురంలో వెస్టిండీస్‌తో తొలి వన్డే ఆడనుంది. ఆ తర్వాత రెండవ మ్యాచ్ సెప్టెంబర్ 30న గువాహటిలో, మూడవ వన్డే అక్టోబర్ 3న చండీగఢ్‌లో జరగనున్నాయి.



## మళ్లీ పట్టాలెక్కనున్న 'ది ఇంటర్న్' రీమేక్

అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కనున్న 'ది ఇంటర్న్' హిందీ రీమేక్ మళ్లీ పట్టాలెక్కనుంది. అమెరికన్ కామెడీ డ్రామాకు రీమేక్‌గా ఈ చిత్రాన్ని రూపొందించేందుకు గత ఐదేళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలోనే అమితాబ్, దీపిక ప్రధాన పాత్రల్లో నటించనున్నట్లు ప్రకటన వచ్చినప్పటికీ, అనివార్య కారణాలతో ప్రాజెక్ట్ నిలిచిపోయింది. తాజాగా ఈ సినిమాను తిరిగి ప్రారంభించేందుకు ప్రయత్నాలు మొదలైనట్లు సమాచారం. అమిత్ శర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. 'పీకూ' తర్వాత అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్ మరోసారి కలిసి నటించనుండటంతో ఈ ప్రాజెక్టుపై ఆసక్తి పెరుగుతోంది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. హాలీవుడ్ చిత్రాన్ని యథాతథంగా తెరకెక్కించకుండా భారతీయ నేపథ్యానికి అనుగుణంగా కథలో పలు మార్పులు చేయనున్నట్లు దర్శకుడు ఇప్పటికే వెల్లడించారు. ఈ చిత్రాన్ని దీపికా పదుకోన్ స్వయంగా నిర్మించనున్నట్లు సమాచారం. దీంతో నటిగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా ఆమె మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఓ యువ వ్యాపారవేత్త ఫ్యాషన్ సంస్థను నడిపించే క్రమంలో ఎదుర్కొనే సవాళ్లు, అదే సంస్థలో 70 ఏళ్ల రిటైర్డ్ వ్యక్తి సీనియర్ ఇంటర్న్‌గా చేరిన తర్వాత వారిద్దరి మధ్య ఏర్పడే వృత్తిపరమైన అనుబంధం, మానవ సంబంధాల నేపథ్యంలో 'ది ఇంటర్న్' కథ సాగుతుంది. హిందీ రీమేక్‌లో ఈ కథను భారతీయ పరిస్థితులకు తగ్గట్టుగా ఎలా మలుస్తారనేది ఆసక్తికరంగా మారింది.

# అందం అంటే ఆరోగ్యమే

ప్రసవానంతరం పెరిగిన బరువుపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విమర్శలు, శరీరాకృతిపై జరుగుతున్న వ్యాఖ్యలపై బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ స్పందించారు. తన దృష్టిలో నిజమైన అందం అంటే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండటమేనని స్పష్టం చేశారు. కెరీర్ ప్రారంభంలో అందానికి సంబంధించిన కఠినమైన ప్రమాణాలను పాటించినప్పటికీ, కాలక్రమేణా తన ఆలోచనల్లో ఎంతో మార్పు వచ్చిందని తెలిపారు శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడంతో పాటు మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం ఎంతో ముఖ్యమని కత్రినా పేర్కొన్నారు. బయట కనిపించే రూపం కంటే వ్యక్తిలో ఉండే ఆత్మవిశ్వాసమే అసలైన సౌందర్యమని అభిప్రాయపడ్డారు. అందం విషయంలో ఇతరులు నిర్ణయించే ప్రమాణాల కంటే, మన గురించి మనం ఎలా భావిస్తున్నామన్నదే ముఖ్యమని చెప్పారు. ఇదిలా ఉండగా, కత్రినాపై జరుగుతున్న ట్రోలింగ్, బాడీ షేమింగ్ వ్యాఖ్యలను పలువురు సినీ ప్రముఖులు ఖండిస్తున్నారు. నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ కూడా దీనిపై స్పందించారు. ప్రసవం తర్వాత మహిళల శరీరంలో హార్మోన్ల మార్పులు చోటుచేసుకోవడం సహజమైన ప్రక్రియ అని ఆమె పేర్కొన్నారు. మహిళల శారీరక మార్పులను అర్థం చేసుకోకుండా హేళన చేయడం సరికాదని ఖుష్బూ అన్నారు. తాను కూడా గతంలో ఇలాంటి విమర్శలను ఎదుర్కొన్నానని గుర్తుచేసుకున్నారు. ఇతరుల వ్యాఖ్యలను పట్టించుకోకుండా మహిళలు తమను తాము ప్రేమించుకోవడం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడమే బాడీ షేమింగ్‌కు సరైన సమాధానమని ఆమె పేర్కొన్నారు.



## 'వెట్టువం' కోసం శోభిత కఠిన శిక్షణ

హైదరాబాద్, సెప్టెంబరు 19 :
అక్కినేని నాగ చైతన్య భార్య, నటి శోభిత ధూళిపాళ్ల ప్రస్తుతం దర్శకుడు పా. రంజిత్ తెరకెక్కిస్తున్న 'వెట్టువం' సినిమాలో శారీరకంగా ఎంతో కఠినమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ పాత్ర కోసం ఆమె చూపిస్తున్న అంకితభావాన్ని దర్శకుడు ప్రత్యేకంగా ప్రశంసించారు. శోభిత అద్భుతమైన నటి అని పేర్కొన్న ఆయన.. ఆమెతో చాలా కాలంగా కలిసి పనిచేయాలని అనుకుంటున్నానని తెలిపారు. సినిమాలోని యాక్షన్ సన్నివేశాల్లో శోభిత ఒక్క షాట్‌కు కూడా డూప్‌ను ఉపయోగించలేదని పా. రంజిత్ వెల్లడించారు. కెమెరా రిహార్సల్స్ సమయంలో మాత్రమే స్టంట్ డబుల్స్ ఉండేవారని, తుది చిత్రీకరణలో మాత్రం శోభిత స్వయంగా అన్ని సన్నివేశాలను చేసేవారని చెప్పారు. పాత్రలో సహజత్వం రావాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని, ఆమె తన వంద శాతం కష్టపడ్డారని రంజిత్ తెలిపారు. మరోవైపు, 'వెట్టువం' కోసం తాను ఎంతో కష్టపడుతున్నట్లు శోభిత కూడా వెల్లడించారు. సినిమాలోని కొన్ని యాక్షన్ సన్నివేశాలు చేయడానికి 15 నుంచి 20 ఏళ్ల శిక్షణ అవసరమయ్యేంత క్లిష్టంగా ఉన్నాయని చెప్పారు. అయినప్పటికీ ప్రతి షూటింగ్ రోజూ ఉత్సాహంతో, బృందంగా కలిసి స్టంట్స్ పూర్తి చేస్తున్నామని తెలిపారు. దర్శకుడి ప్రశంసలు, శోభిత చెప్పిన విషయాలను బట్టి 'వెట్టువం'లో తన పాత్రను సహజంగా, బలంగా తెరపైకి తీసుకురావడానికి ఆమె తీవ్రంగా శ్రమిస్తున్నట్లు స్పష్టమవుతోంది.






## సిద్ధార్థ్‌పై తమన్నా ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబరు 19 :
మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా దాదాపు రెండు దశాబ్దాలుగా దక్షిణాది, హిందీ చిత్రాల్లో నటిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆమె.. సిద్ధార్థ్ మల్హోత్రా కథానాయకుడిగా నటిస్తున్న 'ది వ్యాన్' చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమం తాజాగా ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తన సహనటుడు సిద్ధార్థ్ మల్హోత్రాపై తమన్నా ప్రశంసలు కురిపించారు. తన సినీ ప్రయాణంలో ఎంతోమంది స్టార్ హీరోలతో కలిసి పనిచేశానని చెప్పిన ఆమె.. సిద్ధార్థ్‌లాంటి అందమైన నటుడిని ఇంతవరకు చూడలేదని అన్నారు. 'అందగాడు' అనే పదానికి సిద్ధార్థ్ నిలువెత్తు రూపమని ఆమె చేసిన వ్యాఖ్యలు కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మరోవైపు, సినిమాలో తమన్నా, సిద్ధార్థ్ మధ్య కనిపించే జోడీ కూడా ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉందని ట్రైలర్ చూస్తే తెలుస్తోంది. ఈ చిత్రంలో బిహారీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఛఠ్ పూజ నేపథ్యంలో ఓ ప్రత్యేకమైన పాటను తెరకెక్కించారు. ఈ పాట గురించి మాట్లాడుతున్న సమయంలో తమన్నా తన వ్యక్తిగత అనుభవాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. ముంబయిలో పుట్టి పెరిగిన తనకు జుహూ బీచ్‌లో వేలాది మంది మహిళలు ఛఠ్ పూజ నిర్వహించడం చాలాసార్లు కనిపించేదని తమన్నా తెలిపారు. అయితే ఆ పూజ వెనుక ఉన్న సంప్రదాయాలు, భక్తి, ఆచారాల గురించి సినిమా చిత్రీకరణ సమయంలోనే మరింతగా తెలుసుకున్నానని చెప్పారు. ఛఠ్ పూజలో మహిళలు సుమారు 36 గంటల పాటు నీరు కూడా తీసుకోకుండా కఠినమైన నియమాలను పాటించడం తనను ఆశ్చర్యపరిచిందని పేర్కొన్నారు. బిహారీ సంస్కృతిలో ఛఠ్ పూజకు ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉందని తమన్నా అన్నారు. సాధారణంగా ఉదయించే సూర్యుడికి పూజలు చేయడం చూస్తుంటామని.. అయితే ఈ పూజలో అస్తమించే సూర్యుడికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వడం తనను ఆకట్టుకుందని చెప్పారు. పాట చిత్రీకరణ సమయంలో తనకు ఒక ప్రత్యేకమైన అనుభూతి కలిగిందని, తనలోకి ఏదో తెలియని దివ్యమైన శక్తి ప్రవేశించినట్టుగా అనిపించిందని తమన్నా వెల్లడించారు.



## పీరియడ్స్‌పై శ్రుతి హాసన్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబరు 19:
నటి, గాయని శ్రుతి హాసన్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ విషయాన్ని తాజాగా బహిరంగంగా వెల్లడించారు. నటి సోహా అలీ ఖాన్ నిర్వహిస్తున్న పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె.. పీరియడ్స్ సమయంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులను పంచుకున్నారు. చిన్నప్పటి నుంచే తీవ్ర నొప్పితో బాధపడేదానినని, కొన్ని సందర్భాల్లో వాంతులు, స్పృహ కోల్పోవడం వంటి పరిస్థితులు ఎదురయ్యేవని తెలిపారు. సినిమాల్లోకి వచ్చిన తర్వాత ఈ సమస్య మరింత ఇబ్బందికరంగా మారిందని శ్రుతి చెప్పారు. షూటింగ్‌ల సమయంలో, ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొంటున్నప్పుడు తీవ్రమైన కడుపునొప్పి ఉన్నప్పటికీ ఆ విషయాన్ని ఎవరికీ చెప్పలేకపోయేదానినని తెలిపారు. తన సమస్యను చెప్పడం కంటే దాచుకోవడమే మంచిదని అప్పట్లో భావించేదానినని, దాంతో తాను ఎందుకు నీరసంగా కనిపిస్తున్నానో చుట్టుపక్కల వారికి అర్థం కాకపోయేదని చెప్పారు. అయితే తనతో కలిసి పనిచేసిన ఓ కళాకారుడికి శస్త్రచికిత్స జరిగిన సమయంలో చిత్రబృందం అతనికి అవసరమైన సహాయం చేయడం చూసిన తర్వాత తన ఆలోచన మారిందని శ్రుతి తెలిపారు. తన సమస్యను కూడా చిత్రబృందానికి చెబితే వారు అర్థం చేసుకుంటారనే నమ్మకం కలిగిందని చెప్పారు. ఆ తర్వాత ఓ దర్శకుడితో పీరియడ్స్ సమస్య గురించి చెప్పగా ఆయన ఎంతో సానుకూలంగా స్పందించారని, ఆయనకు కుమార్తె ఉండటంతో తనకు మరింత ధైర్యం వచ్చిందని వెల్లడించారు. అప్పటి నుంచి అవసరమైనప్పుడు తన సమస్య గురించి బహిరంగంగా చెప్పడం ప్రారంభించానని శ్రుతి పేర్కొన్నారు. ఇదే సందర్భంగా ఆమె మగవాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుంటుందని సరదాగా వ్యాఖ్యానించారు. అలా జరిగితే హీరోయిన్ల ఒప్పందాల్లో పీరియడ్స్‌కు సంబంధించిన సెలవులను కూడా ప్రత్యేకంగా ప్రస్తావించేవారేమో అంటూ చమత్కరించారు. శ్రుతి హాసన్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN**, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**